# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

గురువారం | 02 జులై, 2026 | పేజీలు :08




## పారదర్శకంగా సర్ ప్రక్రియ

### బిఎల్ఒల ఇంటింటి ఫారాల పంపిణీని పరిశీలించిన కలెక్టర్ బి.సత్యప్రసాద్

**ప్రజాపక్షం /కోరుట్ల :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కోరుట్ల పట్టణకేంద్రంలో బీ.ఎల్.వోలు ఇంటింటికి వెళ్లి ఎస్.ఐ.ఆర్ ఫారాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు ఓటర్లకు ఫారాల పంపిణీ,వివరాల నమోదు, అవగాహన కల్పన తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ఓటర్లకు ఫారాలను అందజేయాలని, ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ సత్య ప్రసాద్ సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం

తరువాయి 2లో...

## కలెక్టరేట్‌లో శుద్ధజల ప్లాంట్ ప్రారంభం

### జిల్లా కలెక్టర్ కె.హరిత

**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ :** జిల్లా కేంద్రం లోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు శుద్ధ జలం అందించేందుకు ఆర్ఓ ప్లాంట్‌ను బుధవారం ప్రారంభించారు. జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్‌లతో కలిసి జిల్లా కలెక్టర్ కె.హరిత పూజలు నిర్వహించి దీనిని అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ పనుల నిమిత్తం, ప్రజావాణి కొరకు కలెక్టరేట్‌కు వచ్చే వందలాది మంది ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యతలో భాగంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనకాపూర్ శాఖ వారు రూ.2 లక్షల వ్యయంతో ఈ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్ జోషి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, బ్రాంచ్ మేనేజర్ జీవన్ కుమార్, కలెక్టరేట్ పరిపాలన కిరణ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.






## ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

బీఎల్‌వోలు ప్రతి ఓటరుకి ఫారం నింపడంలో అవసరమైన సహకారం అందించాలి

సేకరించిన ఫారాల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

సుల్తానాబాద్ 2వ వార్డు ఎలిగేడు మండలం శివపల్లిలో ఎస్ఐఆర్ ఓటరు నమోదు ప్రక్రియ,రెబ్బల్ దేవ్‌పల్లిలో భూముల సర్వేను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఎలిగేడు మండలంలోని శివపల్లి గ్రామంలో జరుగుతున్న ఎస్ఐఆర్ ఓటరు నమోదు ప్రక్రియను, సుల్తానాబాద్ మున్సిపాలిటీ 2వ వార్డులో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ఓటరు నమోదు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పరిశీలించారు. అనంతరం సుల్తానాబాద్ మండలంలోని రెబ్బల్ దేవ్‌పల్లి గ్రామంలో జరుగుతున్న భూముల సర్వే ప్రక్రియను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫారాల పంపిణీ, సేకరణ, ఆన్‌లైన్ నమోదు పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం అందేలా బీఎల్‌వోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఓటర్లు ఫారాలను సక్రమంగా నింపేందుకు అవసరమైన సహకారం అందించాలని, వివరాలు పూర్తిగా నమోదు అయ్యేలా మార్గనిర్దేశనం చేయాలని తెలిపారు.ఓటర్లు పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను ఎప్పటికప్పుడు సేకరించి, వాటి వివరాలను తరువాయి 2లో..

## అర్హులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి



సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో ఎమ్మార్వో రాజేష్‌కు వినతి

## రహదారి ఇలా నడిచేది ఎలా?

జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ప్రధాన వైద్యశాలకు వెళ్లే దారి ఇలా ఉన్నది


– ప్రజాపక్షం/జగిత్యాల ఫోటోగ్రాఫర్

# సేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి

(మొదటిపేజీ తరువాయి)

ఆలస్యం చేయకుండా నిరంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు పరిరక్షణకు అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మినహాయింపుకు గురికాకుండా క్షేత్రస్థాయిలో సమగ్రంగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం రెబ్బల్ దేవ్‌పల్లి గ్రామంలో కొనసాగుతున్న భూముల సర్వే ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, సర్వేను పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ లు యాకన్న, బషీరోద్దీన్, మున్సిపల్ కమిషనర్ రమేష్, సంబంధిత బీఎల్‌వోలు, తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా సర్ ప్రక్రియ

(మొదటిపేజీ తరువాయి)

పని చేయాలని అన్నారు. ఓటర్ల నుంచి అందిన ఫారాలను నిర్ణీత గడువులోగా స్వీకరించి, వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కూడా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని సరైన సమాచారం అందించాలని కోరారు.ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే కీలక ప్రక్రియ అని పేర్కొన్న కలెక్టర్, అధికారులు, బీ.ఎల్.వోలు పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్ హకీమ్, సంబంధిత సిబ్బంది, బీ.ఎల్.వోలు పాల్గొన్నారు.

# సిపిఐ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి

**ప్రజాపక్షం/వీణవంక :** వీణవంక మండలంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లతోపాటు నిరుపేదలైన కుటుంబాలకు ఇండ్ల స్థలాలను కేటాయించాలని కోరుతూ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి ఇజ్జిగిరి రాంగోపాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని చెప్పి పూర్తిస్థాయిలో అవి మంజూరు చేయడంలో విఫలమైందని ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకొని అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# అర్హులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి

**ప్రజాపక్షం/కరీంనగర్ :** అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేయాలని సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో కరీంనగర్ ఎమ్మార్వో రాజేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని అనేక గ్రామాల్లో ఇల్లు నిర్మించుకోవడానికి ఆర్థిక స్థోమత లేక సొంత స్థలం లేక కుటుంబాల్లో చిన్నచిన్న గదుల్లోనే నివసిస్తున్న కుటుంబాలు ఉన్నాయని, ప్రభుత్వం ప్రభుత్వ భూములను గుర్తించి అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించాల్సిన బాధ్యత ప్రభుత్వం యంత్రాంగంపై ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పేరుతో పథకం ప్రారంభించిందని, ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇళ్లు నిర్మించుకోవడానికి కొంత ఆర్థిక సాయం చేస్తూ కొంతమందికి మాత్రమే ఇళ్లను మంజూరు చేయడం జరుగుతుందని. నగరంలో ఇంకా చాలామందికి ఇండ్లు లేక, ఆర్థిక స్థోమత అందక ప్రభుత్వ చేయూత కోసం ఎదురు చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కరీంనగర్ నియోజకవర్గం పట్ల వివక్ష చూపుతోందని, కరీంనగర్ శివారు చింతకుంటలో కట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను వెంటనే పేదలకు పంపిణీ చేయాలని, ప్రభుత్వం నెలరోజుల్లో అర్హులైన పేదలకు చింతకుంట, తీగలగుట్టపల్లిలో కట్టిన ఇండ్లను ఇవ్వకపోతే సిపిఐ ఆధ్వర్యంలో ఇండ్లను ఆక్రమిస్తామని, ప్రభుత్వ స్థలాలను గుర్తించి నిరుపేదలకు ఇల్లు కట్టించకపోతే సిపిఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ స్థలాలు ఎర్ర జెండాలు పాతీ ప్రజలకు పంచుతామని సురేందర్ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, బీర్ల పద్మ, కొట్టే అంజలి, నగర నాయకులు చిందం మల్లయ్యా, నునావ శ్రీనివాస్ నాయక్, మామిడిపల్లి హేమంత్ కుమార్, చెంచాల మురళి, భారతి, కాల్వ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సర్ ఎన్యూమరేషన్ ఫారాల్లో వివరాలు పక్కాగా నింపాలి

## ఓటర్లకు బీఎల్‌ఓలు సహాయం అందించాలి

### జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఎన్యూమరేషన్ ఫారాల్లో వివరాలు పక్కాగా నింపాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల నుంచి ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ కార్యక్రమాన్ని సిరిసిల్ల పట్టణంలోని 33 వార్డులో బూత్ నంబర్ 163,164, 166 కేంద్రాల పరిధిలో బుధవారం నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించి.. పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ బూత్ లెవల్ అధికారి (బీ ఎల్ ఓ)లు ఓటర్లకు ఇప్పటికే పంపిణీ చేసిన ఫారాలతో పాటు ప్రస్తుత పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో తీసుకోవాలని సూచించారు. ఫారంలో అన్ని వివరాలు పక్కాగా నింపాలని ఆదేశించారు. అన్ని వివరాలు ఆన్లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఈ పరిశీలనలో ఆర్డీఓ శ్రీధర్ బాబు, తహసీల్దార్ మహేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# పేదలకు ఇందిరమ్మ ఇండ్లు పంపిణీ చేయాలి

## సిపిఐ మండల కార్యదర్శి బోయిని తిరుపతి

**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడంతోపాటు నిరుపేదలందరికీ ప్రభుత్వం ఇండ్ల స్థలాలను కేటాయించాలని కోరుతూ బుధవారం తిమ్మాపూర్ మండల సిపిఐ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి బోయిని తిరుపతి మాట్లాడుతూ మండలంలోని అనేక గ్రామాలలో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాలేదని ఇప్పటికీ గుడిసెలలో, రేకుల ఇండ్లలో జీవించేవారు చాలామంది ఉన్నారని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడంతోపాటు మండలంలోని ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, అర్హులైన ఓసి నిరుపేద కుటుంబాలకు ఇండ్ల స్థలాలతోపాటు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొన్నగంటి కేదారి, వంగల భాస్కర్ రెడ్డి, కాంతాల తిరుపతిరెడ్డి, గంగిపల్లి శంకర్, ఆవునూరి రమేశ్, కొంటూ శ్రీను, సముద్రాల రాజయ్యలు పాల్గొన్నారు.

# విబి జి రాంజి చట్టాన్ని రద్దు చేయాలని ధర్నా

**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** జూలై 1 నుంచి విబిజి రాంజీ చట్టాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని నిరసిస్తూ బుధవారం సిఐటియూ, ఐకస్, ఏఐ ఏడబ్లుయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వర్ణ వెంకట్ రెడ్డి, సిఐటియూ జిల్లా అధ్యక్షులు ఉప్పునూటి శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకరి సంపత్‌లు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పోరాడి వామపక్షాలు మద్దతుతో సాధించుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి విబిజి రాంజీ చట్టాన్ని తీసుకురావడం దారుణమన్నారు. గతంలో 90 శాతం ఇచ్చే నిధులకు కోత పెట్టి 60 శాతం నిధులను కేటాయించి మిగతా 40 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని కేంద్రం తన బాధ్యత నుంచి తప్పుకుందన్నారు. కూలీల హక్కులను హరించేవిధంగా ఉన్న ఈ చట్టాన్ని తెలంగాణలో అమలు చేయవద్దని డిమాండ్ చేశారు. అదేవిధంగా అసెంబ్లీలో తీర్మాణం చేసి కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంటి శ్రీనివాస్, జి.రాజేశం, పున్నం రవి, మాతంగి శంకర్, గౌరిమియా రజిత, వీరమ్మ, జ్యోతి, పుల్లేల మల్లయ్య, బుర్ర రత్నాకర్, మల్లేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

## డీఎస్పీ కే.పురుషోత్తం రెడ్డి

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** యువత, విద్యార్థులు క్షణికానందం కోసం మాదకద్రవ్యాల (డ్రగ్స్) వైపు ఆకర్షితులై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని డీఎస్పీ కే.పురుషోత్తం రెడ్డి అన్నారు. గొల్లపల్లి మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్)లో బుధవారం మాదక ద్రవ్యాల నిర్మూలన పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో లీడ్ ఇండియా ఫౌండేషన్, షీ టీం, మహిళా సాధికారత, సఖీ సంస్థల అధికారులు సైతం పాల్గొని డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముందుగా మోడల్ స్కూల్ విద్యార్థులతో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు బొమ్మెన కుమార్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన జగిత్యాల డీఎస్పీ కే. పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో మత్తు పదార్థాలు యువతను ఏ విధంగా నిర్వీర్యం చేస్తున్నాయో ఆందోళన వ్యక్తం చేశారు.



# నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ళు నిర్మించి ఇవ్వాలి

## సిపిఐ జగిత్యాల పట్టణ కార్యదర్శి కిరణ్ కుమార్

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సీపీఐ జగిత్యాల పట్టణ కార్యదర్శి కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లాలో ప్రభుత్వ స్థలాలను గుర్తించి నిరుపేదలకు పక్కా ఇందిరమ్మ ఇండ్లు కట్టించి ఇవ్వాలని కోరుతూ జగిత్యాల పట్టణ భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ రాజ గౌడ్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ భూములు, భూదాన్ భూముల్లో నిరుపేదలు వేసుకున్న గుడిశెలకు ఇండ్ల పట్టాలిచ్చి పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. నిరుపేద కుటుంబాలు ప్రభుత్వ స్థలాల్లో ,భూదాన్ భూముల్లో వేసుకున్న గుడిసేలను తొలగించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 జీవించే హక్కు ఉల్లంగించడమే అవుతుందన్నారు. నిరుపేదల పక్షపాతిగా ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెన్న మహేష్ ,గుండారపు ధర్మయ్య,కోరుకంటి శ్రీనివాస్, అతిక్, రజాక్, ఉన్నారు.

# వైద్యులను సత్కరించిన కాకతీయ స్మార్ట్‌కిడ్స్ విద్యార్థులు



**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కాకతీయ స్మార్ట్‌కిడ్స్ పాఠశాల విద్యార్థులు మెడికవర్ ఆసుపత్రిని సందర్శించి వైద్యులకు పుష్పగుచ్చాలు అందజేసి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో వైద్యులు అందజేస్తున్న సేవలు అమూల్యమైనవని కొనియాడారు. ప్రతి ఒక్కరి జీవితంలో వైద్యుల పాత్ర ఎంతో గొప్పదని పేర్కొంటూ వారి సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రి వైద్యులు విద్యార్థులకు ఆరోగ్యకరమైన జీవనశైలి, వ్యక్తిగత పరిశుభ్రత, సమతుల్య ఆహారం యొక్క ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. కాకతీయ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, మెడికవర్ ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

# 37ఏళ్ల విశిష్ట సేవలకు ఘన సత్కారం




**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వర్తించి బుధవారంతో పదవి విరమణ పొందుతున్న ఆంజనేయులు వీడ్కోలు కార్యక్రమాన్ని గ్రామ శివారులోని వెంకటేశ్వర స్వామి కళ్యాణ మండపంలో ఇబ్రహీంపట్నం పోలీస్ శాఖ ఘనంగా నిర్వహించింది.ఈ సందర్భంగా ఏఎస్ఐ ఆంజనేయులు పలు పోలీస్ స్టేషన్లలో 37 సంవత్సరాల పాటు వివిధ హోదాల్లో విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెట్పల్లి సిఐ సురేష్ బాబు హాజరయ్యారు.అనంతరం ఏఎస్ఐ ఆంజనేయులును సీఐ సురేష్ బాబు, స్థానిక ఎస్సై జి.నవీన్ కుమార్ శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేసి అభినందించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ మూడు దశాబ్దాలకు పైగా పోలీసు శాఖలో అంకిత భావంతో సేవలందించిన ఆంజనేయులు సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా జీవించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జి.నవీన్ కుమార్, పోలీసు అధికారులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## వైద్య వృత్తిలో డాక్టర్ల సేవలు మరువలేనివి



ప్రజాపక్షం/మల్లాపూర్ : వైద్య వృత్తిలో డాక్టర్ల సేవలు మల్లాపూర్ మరువలేనివని సర్పంచ్ చిట్యాల లక్ష్మ ణ్, పాలకవర్గసభ్యులు అన్నారు. బుధవారం డాక్టర్స్ డే సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు వాహిని కి పుష్పగుచ్ఛని అందించి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు ముష్కరి రమేష్,ముత్యాల గంగారాజం, భూక్య శేఖర్ లతా చంద్రయ్య, ఆసుపత్రి సిబ్బంది, ఉన్నారు.

## రైతుల సమస్యకు పరిష్కారం చూపుతాం



ప్రజాపక్షం/మల్లాపూర్ : మల్లాపూర్ గ్రామ శివారులోని రైతుల పంట పొలాల్లోకి మురుగునీరు చేరి పంట నాశనమవుతుందని గ్రామపంచాయతీలు రైతుల ఫిర్యాదు చేయగా, మరుగునీటి చేరి నష్టపోతున్న పంటపొలాలను ఎంపీఓ మహేశ్వర్ రెడ్డి బుధవారం సందర్శించారు. మురుగునీరుతో తాము పడుతున్న ఇబ్బందులు తొలగించాలని కోరగా,విచారణ జరిపి సమస్య పరిష్కారం చూపుతామని రైతులకు తెలిపారు. వీరి వెంట సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ మనోహర్ రెడ్డి ,వార్డు సభ్యులు ముష్కరి రమేష్, సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి, తదితరులున్నారు.

## ధ్వంసం చేసినవారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాపక్షం/మానకొండూర్: మండలంలోని రంగపేట గ్రామ శివారులోని డిబిఎం 6, 3ఎల్ ఉప కాల్వలను జేసీబితో ధ్వంసం చేసి పైపులైను వేసిన రంగపేట గ్రామానికి చెందిన రైతు గోపు శ్రీనివాస్ రెడ్డి, అతనికి సహకరించిన అదే గ్రామానికి చెందిన గుడాల శ్రీనివాస్, అనిరెడ్డి సమ్మిరెడ్డి, పెసరు శ్రీనివాస్ లపై చర్యలు తీసుకోవాలని రంగపేట సర్పంచ్ కొత్త రాంరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మానకొండూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సర్పంచ్ మాట్లాడుతూ పై నలుగురు వ్యక్తులు ఇటీవల రాత్రి వేళల్లో ఎసారెస్పీ ఉప కాల్వను ధ్వంసం చేసి పైప్‌లైన్ వేశారని తెలిపారు. ప్రభుత్వ ఆస్తి అయిన కాలువను ధ్వంసం చేసినవారిపై ఎస్సారెస్పీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎస్సారెస్పీ అధికారులు ఇప్పటికైనా స్పందించి ఉప కాలువను ధ్వంసం చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ రాంరెడ్డి డిమాండ్ చేశారు. తను ఉప సర్పంచ్ కలిసి ఎస్సారెస్పీ డిఈకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట సంపత్ రెడ్డి ఉన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు స్కూల్ ఫీజులో 50 శాతం రాయితీ

### సర్క్యులర్ జారీ చేసిన జిల్లా కలెక్టర్‌కు ధన్యవాదాలు




ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : టియుడబ్ల్యూజే ఐజేయు కృషితో జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు స్కూల్ ఫీజులో 50 శాతం రాయితీ లభించిందని టియుడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాసరావు అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తా సమీపంలో గల టియుడబ్ల్యూజే ఐజేయు అనుబంధ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జర్నలిస్టుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే టియుడబ్ల్యూజే ఐజేయు జిల్లా కార్యవర్గంతో కలిసి సుమారు 550 మంది సభ్యుల్లో చిన్న పిల్లలు ఉన్నవారికి 50 శాతం ఫీజులో రాయితీ కోసం జిల్లాలోని అన్ని ప్రైవేటు విద్యాసంస్థలను సంప్రదించి జిల్లా కమిటీ ద్వారా జిల్లా కలెక్టర్‌కు విన్నవించామన్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కలెక్టర్ జీవో లేకున్నా మానవతా దృక్పథం తో ప్రైవేటు విద్యా సంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీ కల్పిస్తూ సర్క్యులర్ జారీ చేశారని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు జిల్లా కార్యవర్గం పక్షాన ధన్యవాదాలు తెలిపారు.ప్రైవేటు విద్యా సంస్థలతో కూడా ఈ విషయాన్ని చర్చించి అర్హులైన ప్రతి జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీ అందేవిధంగా చూస్తామన్నారు. జిల్లాలో జర్నలిస్టులు హక్కుల పరిరక్షనే ధ్యేయంగా పని చేస్తున్నాం అని జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బెజ్జెంకి సంపూర్ణ చారి,ఉపాధ్యక్షులు గడ్డల హరికృష్ణ,హైదర్ అలీ, కోశాధికారి సిరిసిల్ల వేణు గోపాల్, సహాయ కార్యదర్శి గుర్రం చంద్ర శేఖర్,కార్యవర్గ సభ్యులు సంబు రాజిరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## సమతుల్య ఆహారంతో అనారోగ్య సమస్యల నివారణ



ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల పట్టణంలోని KGR హైస్కూల్ (CBSE) లో అర్జున్ చిల్డ్రన్ & మెటర్నిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ శిబిరంలో ఆసుపత్రి డా.గుండేటి అర్జున్ పిల్లల వైద్య నిపుణులు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి,వారి ఆరోగ్య పరిస్థితులను పరిశీలించారు.అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేసి,ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డా.గుండేటి అర్జున్ మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం,సమతుల్య ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలను నివారించవచ్చని వైద్యులు సూచించారు. చిన్నపిల్లల్లో తరచుగా కనిపించే వ్యాధులు, వాటి నివారణ చర్యలపై విద్యార్థులు,తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. పాఠశాల యాజమాన్యం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించిన అర్జున్ చిల్డ్రన్ & మెటర్నిటీ హాస్పిటల్ వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపింది.ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు,హాస్పిటల్ సిబ్బంది ,స్కూల్ సిబ్బంది,విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## క్షయ లక్షణాలు ముందస్తు గుర్తింపుతో నివారణ



ప్రజాపక్షం/జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం అనంతారం గ్రామంలోని కల్లెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో క్షయ ముక్త అభియాన్ భారత్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా మొబైల్ ఎక్స్‌రే యంత్రం ద్వారా క్షయవ్యాధి సోకే అవకాశం ఉన్న ప్రజలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు.అలాగే అనుమానితులకు ఎన్.ఎ.ఎ.టి పరీక్ష ద్వారా ముందస్తు నిర్ధారణ కోసం నమూనాలను సేకరించారు.ఉపవైద్యాధికారి డా.ఎన్. శ్రీనివాస్ శిబిరాన్ని సందర్శించిన క్షయ వ్యాధి లక్షణాలు,ముందస్తు గుర్తింపు,చికిత్స,నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా వృద్ధులకు,ఇతర గ్రామస్థులకు డయాబెటిస్, రక్తపోటు (బీపీ), జ్వరం తదితర వ్యాధుల నిర్ధారణ కోసం పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలను ప్రజలకు ఉపవైద్యాధికారి డా.ఎన్. శ్రీనివాస్ చేశారు.అనతారం గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ క్షయవ్యాధిని ముందుగానే గుర్తించి పూర్తి చికిత్స తీసుకుంటే పూ ర్తిగా నయం చేయవచ్చు. ఆరోగ్యవంతమైన గ్రామ ని ర్మాణానికి ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అని అనతారం గ్రామ సర్పంచ్ బత్తిని రవీనా మహేష్ గ్రామ ప్రజలకు పిలుపునించారు.ఈ కార్యక్రమంలో పి.హెచ్.సి వైద్యాధికారి డా.సౌజన్య,నాయకులు మహేష్, హెల్త్ సూపర్వైజర్ జగదీశ్వర్, ఎస్తర్, ఎల్.టి. బెనర్జీ,హెల్త్ అసిస్టెంట్లు రవీందర్,శ్రీనివాస్,రాజేందర్,ఎఎన్ఎంలు స్వరూప, జయమ్మ, పంచాయతీ కార్యదర్శి వెంకట్,ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.

## విద్యార్థులకు బ్యాగులు, విద్యా సామగ్రి పంపిణీ



ప్రజాపక్షం/బీర్‌పూర్ : జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని కండ్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు, విద్యా సామగ్రి పంపిణీ బీర్‌పూర్ మండలంలోని కండ్లపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో వనపర్తి రమేష్ దుర్గ ఆధ్వర్యంలో విద్యార్థులకు పాఠశాల బ్యాగులు, ఇతర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సిరుప నాగభూషణం పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రకాసం వేణుగోపాల్ ,కండ్లపల్లి గ్రామ సర్పంచ్ తోగిడి సత్తవ్వ,వార్డు సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు మరియు గ్రామ నాయకులు హాజరయ్యారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం ద్వారా వారి విద్యాభ్యాసానికి ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. సమాజంలోని దాతలు విద్యాభివృద్ధికి సహకరించడం అభినందనీయమని కొనియాడారు. పాఠశాల తరపున ప్రధానోపాధ్యాయులు కాసం వేణుగోపాల్ వనపర్తి రమేష్ దుర్గ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసి, విద్యార్థుల అభివృద్ధికి ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు,ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు,తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

## ధర్మారం శ్రీకృష్ణ యాదవ సంఘం అధ్యక్షుడిగా దండిగా శంకర్

ప్రజాపక్షం/జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం ధర్మారం గ్రామంలోని శ్రీకృష్ణ యాదవ సంఘ భవనంలో బుధవారం సంఘ సభ్యులప్రాథమిక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్యంగా సంఘం బలోపేతం,భవిష్యత్తులో చేపట్టబోయే సామాజిక, సంక్షేమ కార్యక్రమాలు, సంఘ భవన అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై సభ్యులు సుదీర్ఘంగా చర్చించి, పలు నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా దండిగ శంకర్ యాదవ్, ఉపాధ్యక్షుడిగా దండిగ తిరుపతి, సెక్రటరీగా పరమాల కొమురెల్లి ఎన్నుకున్నారు. అలాగే కమిటీ సభ్యులుగా పరమాల లచ్చయ్య యాదవ్, కొండవీని మల్లయ్య, కాసాడి కొమురెల్లి యాదవ నియమితులయ్యారు. నూతన అధ్యక్షుడు దండిగ శంకర్ యాదవ్ మాట్లాడుతూ సభ్యులందరూ తనపై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతను అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. అందరినీ కలుపుకుంటూ,పరస్పర సహకారంతో సంఘం యొక్క సర్వతోముఖాభివృద్ధికి, యాదవ సోదరుల ఐక్యతకు శాయశక్తులా కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం మాజీ అధ్యక్షుడు పరుమాల రాజన్న యాదవ్, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నూతన కార్యవర్గానికి శాలువాలు కప్పి,పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## జిల్లాలో పోలీస్ యాక్ట్ అమలు

### జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నెల రోజుల (జూలై 1వ తేది నుండి 31 వరకు) పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు.దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు,రాస్తా రోకోలు,నిరసనలు,ర్యాలీలు,పబ్లిక్ మీటింగ్ లు,సభలు, సమావేశాలు నిర్వహించరాదని, నిబంధనలకు విరుద్దిదంగా డి.జే వినియోగించారాదని తెలిపారు. శాతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు.కాబట్టి జిల్లా ప్రజలు పోలీసు వారికి ఇట్టి విషయంలో సహకరించాలని శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

## గంగిపల్లి సహకార సంఘం అధ్యక్షునిగా సీతారాంరెడ్డి

ప్రజాపక్షం/మానకొండూర్ : గంగిపల్లి గ్రామంలోని ధనలక్ష్మీ ధాన్య విత్తన రైతు పరస్పర సహకార పరపతి సంఘం ఎన్నికలు బుధవారం జరిగాయి. ఈ ఎన్నికల్లో సంఘం అధ్యక్షులుగా గంగిపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ శ్రీరెడ్డి సీతారాం రెడ్డి, జనరల్ మేనేజర్ గా పెద్దిరెడ్డి మహేందర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులుగా పారిపెల్లి శ్రీనివాస్ రెడ్డి, బండ అనంత రెడ్డి, కేసిరెడ్డి మల్లా రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షులు సీతారాం మాట్లాడుతూ సంఘం అభివృద్ధి కోసం సంఘ రైతుల శ్రేయస్సు కోసం సేవా భావంతో ముందుకు రావడం జరిగిందని సంఘంలో నిర్వహించే వ్యవహారాలను తన పూర్తి సామర్థ్యంతో పని చేస్తూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

## ఘనంగా డాక్టర్స్ డే సెలబ్రేషన్స్

ప్రజాపక్షం/కొత్తపల్లి : జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ , మంకమ్మతోటలోని పారమిత లిటిల్ జీనియస్ పాఠశాలల్లో ఘనంగా వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ కు చెందిన ప్రముఖ వైద్యులు పాల్గొని అమూల్యమైన సలహాలను అందించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని కాపాడడమే వారి ప్రధాన కర్తవ్యమని తెలిపారు. ఈ సందర్భంగా పారమిత పాఠశాలల అధినేత డా.ఇనుగంటి ప్రసాదరావు మాట్లాడుతూ వైద్యుల సేవలను గుర్తెరిగిన పూర్వీకులు వైద్యో నారాయణో హరి అన్నారని అనగా వైద్యులు దేవునితో సమానమని వారి సేవలు అనన్యమైనవని కొనియాడారు. రోగిలో ఆత్మ విశ్వాసాన్ని నింపి వారి బాగు కోసం నిరంతరం శ్రమించే వారు నిజంగా దైవ స్వరూపులని వారు లేని సమాజం ఊహించలేమని వైద్యులను ప్రశంసించి ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, వినోద్ రావు, వియుయం ప్రసాద్ హన్మంతరావు, ప్రిన్సిపల్స్ గోపికృష్ణ, ప్రశాంత్, కవిత, ప్రసాద్, సమన్వయకర్తలు నాగరాజు, రాము, కీర్తన, నాజీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా పోచమ్మ బోనాలు



**ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్:** పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లిలో బుధవారం పోచమ్మ బోనాల వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో డప్పు చప్పుళ్ళతో బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్ళారు. ఆలయంలో బోనాలను పోచమ్మ దేవతకు నైవేద్యంగా సమర్పించారు.పిల్లా పాపలతో ఊరి ప్రజలను చల్లగా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ప్రార్థించారు.వేడుకల్లో మున్నూరు కాపు సంఘం నాయకులు, సభ్యులు,మహిళలు పాల్గొన్నారు.

## విద్యానిధి పథకం కింద దరఖాస్తుల ఆహ్వానం

### జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం. రవీందర్

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** 202627 విద్యా సంవత్సరానికి సంబంధించి అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానిస్తుందని పెద్దపల్లి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం. రవీందర్ బుధవారం ప్రకటనలో తెలిపారు.ఈ పథకం ద్వారా విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే జిల్లాలోని అర్హులైన ఎస్సీ విద్యార్థిని, విద్యార్థులు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని, ఆసక్తి గల అభ్యర్థులు జూలై 01,2026 నుండి ఆగస్టు 31, 2026 లోపుhttps://telanganapass.cgg.gov.in వెబ్సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖా స్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## విద్యార్థులకు ఎక్సలెన్స్ అవార్డ్స్

**ప్రజాపక్షం/పెద్దపల్లిటౌన్:** బుధవారం రోజున గాయత్రి విద్యానికేతన్ పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తూ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 'ఎక్సలెన్స్ అవార్డు–2026' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి హాజరైన సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ మేనేజర్ సుమన్, అసిస్టెంట్ మేనేజర్ వినయ్, లీగల్ అడ్వైజర్ రవీందర్ ప్రతిభావంతులైన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు,మెమోటోస్ అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మరియు అసిస్టెంట్ మేనేజర్ గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్‌ను శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంలో అల్లంకి శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యార్థులు సాధించిన విజయం వారి కృషి, క్రమశిక్షణ,పట్టుదల మరియు తల్లిదండ్రులు,ఉపాధ్యాయుల సహకారానికి నిదర్శనమని అన్నారు.ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రజని దేవి ,ప్రిన్సిపాల్ విజయ్,వైస్ ప్రిన్సిపాల్ ప్రియాంక ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే రైతుకు భరోసా



**ప్రజాపక్షం/గంగాధర :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రైతులకు భరోసా దక్కుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి మహేందర్ అన్నారు. ఈ ఖరీఫ్ సీజన్ కోసం రైతు భరోసా కింద ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయడంతో బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ రైతు సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని రైతు భరోసా కింద 9 రోజుల్లో 9 వేల కోట్ల పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్షాల వెన్నులో వణుకు పుడుతోందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని మరో 10 ఏళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో నియోజకవర్గం అన్ని రంగాల్లో దూసుకుపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్ రావు, సర్పంచుల ఫోరం అధ్యక్షులు ముద్దం నగేశ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తోట కరుణాకర్, సరంచులు వేముల భాస్కర్, రాచమల్ల రవి, లింగాల లింగయ్య, రేండ్ల శ్రీనివాస్, బీర్ల ఆనందం, చిందం ఆంజనేయులు, బారాజు ప్రభాకర్ రెడ్డి, పురుమల్ల మనోహర్, సత్తు కనకయ్య, పడాల రాజన్న, కంకణాల రాజగోపాల్ రెడ్డి, గునుకొండ బాబు, వేముల అంజి, సాగి అజయ్ రావు, మేర్జ కొండయ్య, కర్ర బాపురెడ్డి, బైరిశెట్టి సంపత్, అట్ల శేఖర్ రెడ్డి , ఆరె రాజశేఖర్ రెడ్డి, గుడి ప్రవీణ్ రెడ్డి, కడారి కనకయ్య, గుండావేణి తిరుపతి, కొలిపాక మల్లేశం, పెంచాల చందు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమాజ నిర్మాణంలో వైద్యుల సేవలు అమూల్యం

### ఎంపిడివో దమ్మని రాము

**ప్రజాపక్షం/గంగాధర :** ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో వైద్యుల సేవలు అమూల్యమైనవని ఎంపిడివో దమ్మని రాము అన్నారు. బుధవారంజాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంపిడివో దమ్మని రాము ఆధ్వర్యంలో గంగాధర మండల పరిషత్ కార్యాలయంలో వైద్యులు, ఎంఎల్‌హెచ్‌పిలు, పిహెచ్‌సి సిబ్బంది, స్టాఫ్ నర్సులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో వైద్యుల సేవలు చాలా విలువైనవని అన్నారు. ఆరోగ్యంవిద్య శాఖల సమన్వయంతో గంగాధర మండలంలో అమలైన వినూత్న కార్యక్రమాలు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయన్నారు. డా.సౌమ్య మాట్లాడుతూ వైద్యుల సేవలను గుర్తించి సత్కరించడం స్ఫూర్తిదాయకమని ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి అన్ని శాఖల సమన్వయం అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎండిఎం కార్మికులకు తెలంగాణలోనే తొలిసారిగా ఆరోగ్య పరీక్షలు, ఇటుక బట్టీలలో వైద్య శిబిరాలు, పాఠశాలల్లో మునగాకు వినియోగం, హెచ్‌పివి టీకా కార్యక్రమంలో 16 మండలాల్లో ప్రథమ స్థానం, జడ్పిహెచ్ఎస్ ఓద్యారం ఎస్‌హెచ్‌విఆర్ జాతీయ స్థాయిలో 190 పాఠశాలల్లో 23వ ర్యాంకు సాధించడం పిహెచ్‌సి వైద్యుల సహకారాన్ని గుర్తు చేశారు. పదో తరగతి పరీక్షలో అస్వస్థకు గురైన విద్యార్థిని ఆర్.అక్షయకు సకాలంలో చికిత్స అందించి అంబులెన్స్‌లోనే పరీక్ష రాసే అవకాశం కల్పించడం ద్వారా ఆమె 488 మార్కులతో ఉత్తీర్ణత సాధించి ప్రస్తుతం ఇంటర్ చదువుతున్న విషయాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా డాక్టర్లు సౌమ్య, టి.శిరీష, సుమన్, డా.జగదీష్, ఎంఎల్‌హెచ్‌సిలు మౌనిక, ప్రియాంక, విజయభారతి, శృతితోపాటు పిహెచ్‌సి స్టాఫ్ నర్సులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ఎంపివో ప్రత్యూష, పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షులు గౌరీ రమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లెల్ల లచ్చయ్య, ఏపివో సత్యప్రకాశ్, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



### నెల రోజుల్లో ఇండ్లు ఇవ్వకపోతే ఆక్రమిస్తాం

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కసిరెడ్డి సురేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/కొత్తపల్లి :** అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సిపిఐ రూరల్ మండల సమితి ఆధ్వర్యంలో కరీంనగర్ రూరల్ తహసీల్దార్ నరసింహారావు కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యుడు కసిరెడ్డి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ రూరల్ మండల పరిధిలోని గ్రామాల్లో ఇళ్లు నిర్మించుకోవడానికి ఆర్థిక స్తోమత లేక స్వంత స్థలం లేకపోవడం మూలంగా వారి ఉమ్మడి కుటుంబాల్లో చిన్న చిన్న గదుల్లోనే నివసిస్తున్న కుటుంబాలు చాలా ఉన్నాయని ప్రభుత్వం ప్రభుత్వ భూములను గుర్తించి అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపైన ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పేరుతో పథకం ప్రారంభించి ఇళ్లు నిర్మించుకోవడానికి కొంత ఆర్థిక సహాయం చేస్తూ కొంతమందికి మాత్రమే ఇండ్లు మంజూరు చేశారు. ఇంకా చాలా మంది ప్రభుత్వ చేయూత కోసం ఎదురుచూస్తున్నారని ప్రభుత్వం కరీంనగర్ నియోజకవర్గం పట్ల వివక్ష చూపుతోందని డబుల్ బెడ్ రూం ఇండ్లను వెంటనే పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నెల రోజుల్లో అర్హులైన పేదలకు గ్రామాల్లో కట్టిన ఇండ్లను ఇవ్వకపోతే సిపిఐ ఆధ్వర్యంలో పేదల ఇండ్లను ఆక్రమిస్తామని ప్రభుత్వ స్థలాలను గుర్తించి నిరుపేదలకు ఇండ్లు కట్టించకపోతే సిపిఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ స్థలాల్లో ఎర్ర జెండాలు పాతి ప్రజలకు పంచుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల కార్యదర్శి నెల్లి రాజేశం, జిల్లా కౌన్సిల్ సభ్యులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్,మామిడిపల్లి హేమం త్ కుమార్, చెంచాల మురళి, భారతి, కాల్వ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్స్ డే సంబరాలు




**ప్రజాపక్షం/కొత్తపల్లి :** ప్రతి ఒక్కరికి ఆనందకరమైన జీవితాన్ని గడపాలని ఉంటుందని ఏర్పరచుకున్న లక్ష్యాలను ఎటువంటి ఇబ్బంది లేకుండా సాధించాలనే కోరిక ఉంటుందని ఆ కోరికలను డాక్టర్లు నెరవేరుస్తారని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత, విఎన్నార్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా.వి.నరేందర్ రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఇటెక్నో పాఠశాలలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై బిసి రాయ్ చిత్ర పటానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. అనంతరం మాట్లాడారు. సమాజాభివృద్ధిలో వైద్యుల పాత్ర చాలా కీలకమైందని వెలకట్టలేనిదని పేర్కొన్నారు. ఆల్ఫోర్స్‌లో చదివిన విద్యార్థులు వివిధ మెడికల్ కళాశాలల్లో మెడిసిన్ పూర్తి చేసుకున్న సందర్భంగా వారిని ఘనంగా సత్కరించారు. డాక్టర్లు, చార్టెడ్ అకౌంటెట్లు విశిష్ట సేవలను తెలిపే నాటికలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పేదలకు ఇండ్లు మంజూరు చేయాలి



**ప్రజాపక్షం/చిగురుమామిడి :** ఇండ్ల స్థలాలు లేక ఇండ్లు నిర్మించుకోలేని వారికి ప్రభుత్వం ఇండ్ల స్థలాలను ఇవ్వడంతోపాటు నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సిపిఐ నాయకులు చిగురుమామిడి మండల డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మండలంలోని అనేక గ్రామాల్లో ఇండ్లు నిర్మించుకోవడానికి ఆర్థిక స్థోమత లేక స్వంత స్థలం కూడా లేకపోవడం మూలంగా ఉమ్మడి కుటుంబాల్లో చిన్న చిన్న గదుల్లో నివసిస్తున్న కుటుంబాలు చాలా ఉన్నాయని గ్రామాల్లో ప్రభుత్వ భూములను అధికారులు గుర్తించి అర్హులైన పేదలందరికీ ఇండ్ల స్థలాలు కేటాయించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిందని కానీ అందరికీ పూర్తిస్థాయిలో ఫలాలు దక్కలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు అందె చిన్నస్వామి, బోయిని వల్లభాయ్ పటేల్, మావురపు రాజు, బూడిద సదాశివ, పైడిపల్లి వెంకటేశ్, గోలి బాపురెడ్డి, ఎండి ఉస్మాన్ పాషా, ఎలగందుల రాజు, మొగిలి ఓదేలు, తమ్మిశెట్టి రవీందర్, రాకం అంజవ్వ, అందె తిరుపతి, మహంకాళి రాములు, తాళ్లపెల్లి చంద్రయ్య, అనువోజు జనార్ధన్ కయ్యం వీరయ్య, చెంచల రవి, బద్దం కొమురెల్లా రెడ్డి, నాయిని సురేశ్, పీచు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నల్లబ్యాడ్జిలతో నిరసన



**ప్రజాపక్షం/రామగిరి :** అర్జీ 3ఏరియాలో ఏఐటీయూసీ యూనియన్ ఆధ్వర్యంలో అన్ని కార్మిక సంఘాలను కలిసి జేఏసీ గ ఏర్పడి మంగళవారం కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ ల విధానాలు రద్దు చేయాలని ఓసిపి1,ఓసిపి2, ఏఎల్పీ మైన్ ల వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపి మైన్ అధికారులకు వినతి పత్రం అందజేశారు.యూనియన్ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక కర్షేక వ్యతిరేక విధానాలకు నాలుగులేబర్ కోడ్ ల రద్దు చేయాలి.12 వ వెజ్ బోర్డు ను వెంటనే ఏర్పాటు చేయాలి కోరారు.ఈ ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ యూనియన్,ఐఎన్టివియుసి,సిఐటియు, హెచ్ ఎం ఎస్ నాయకులు అన్ని గనుల పిట్ సెక్రటరీ లు,జీఎం చర్చల కమిటీ ప్రతినిధులు,వర్క్ మెన్ ఇన్స్పెక్టర్,సేఫ్టీ మైన్స్ కమిటీ మెంబర్స్,క్యాంటీన్ మరియు టెంపుల్ కమిటీ మెంబర్స్,కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన ఏడిగా రాజేందర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



**ప్రజాపక్షం/భీమ్‌గల్‌:** మండల విద్యుత్ శాఖ నూతన అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్(ఏడీ)గా రాజేందర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇన్‌చార్జి ఏడీ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ పరిపాలన కొనసాగుతుండగా ప్రభుత్వం ఇటీవల రాజేందర్‌రెడ్డిని శాశ్వత ఏడీగా నియమించింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం విద్యుత్ శాఖ టౌన్ ఏఈ సత్యప్రసాద్, అధికారులు సిబ్బంది లైన్‌మెన్లు రాజేందర్‌రెడ్డిని శాలువతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఏడీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. విద్యుత్ అంతరాయాలను వీలైనంత త్వరగా పరిష్కరించటం, పెండింగ్‌లోని సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించటం, ప్రజలకు మెరుగైన సేవలందించడడం తన లక్ష్యమన్నారు. అలాగే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ లైన్ల నిర్వహణ, ట్రాన్స్‌ఫార్మర్ల పర్యవేక్షణ, ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతామని చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ టౌన్ ఏఈ సత్యప్రసాద్, అధికారులు, కార్యాలయ సిబ్బంది, వివిధ గ్రామాల లైన్‌మెన్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాలపై వృక్ష సామ్రాజ్యం

**ప్రజాపక్షం/ఎడపల్లిః** సాధారణంగా మొక్కలు భూమిపై పెరుగుతాయి. లేదా పెరటి తోటల్లో కనిపిస్తాయి. కాని నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు మాత్రం ఇందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. ఇక్కడ మొక్కలను ఎవరూ నాటలేదు. కానీ భవనాలపై అవే మొలిచి రారాజుల్లా వెలుగొందుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం పుణ్యమా అని ఐకెపి, ఉపాధి హామీ కార్యాలయాల స్లాబులపై చెట్లు పెరిగి పెద్దవవుతుండటం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.ఎంపీడీవో కార్యాలయంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఒకవైపు స్లాబు పెచ్చులు ఊడి కింద పడుతుంటే అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కార్యాలయాల స్లాబులపై పెరుగుతున్న చెట్ల వేళ్లు లోపలికి చొచ్చుకుపోయి భవనం పటిష్టతను దెబ్బతిస్తాయి. ఐకెపి, ఉపాధి హామీ కార్యాలయాల పరిస్థితి కూడా ఇదే రీతిలో ఉంది. పర్యవేక్షణ లోపం వల్ల చిన్న మొక్కలుగా ఉన్నవి కాస్తా ఇప్పుడు చెట్లుగా మారుతున్నాయి.చెట్లు పెరిగి వేళ్లు పాతుకుపోతే భవనాలు కుప్పకూలే ప్రమాదం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు. భవనం బలహీనపడటంతో పాటు వర్షాకాలంలో నీరు లీక్ అయ్యే అవకాశం ఉంది. ఫలితంగా ప్రభుత్వ ఆస్తులు ధ్వంసమవుతాయి.ప్రమాదం జరిగిన తరువాత స్పందించడం కంటే ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టి నివారణ చర్యలు చేపట్టడం ఉత్తమం. భవనాలు మరింత బలహీనం కాకముందే మరమ్మతులు చేపట్టి, అటు ప్రజల, ఇటు సిబ్బంది ప్రణాలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.



# 12వ వేజ్ బోర్డు కమిటీని వెంటనే నియమించాలి

### ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ



**ప్రజాపక్షం/మందమర్రి :** 2026 జూలై 1 నుంచి అమల్లోకి రావాల్సిన 12వ వేజ్ బోర్డు కమిటీని వెంటనే నియమించి, కొత్త వేతన ఒప్పందాన్ని అమలు చేయాలని జాతీయ కార్మిక సంఘాల జెఏసి డిమాండ్ చేసింది. ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ నాయకత్వంలో బుధవారం మందమర్రి ఏరియాలో విస్తృత నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. కేకే5 గని, కెకె ఒసి, ఏరియా వర్క్ షాప్, సివిల్ డిపార్ట్మెంట్, ఎస్ అండ్ పిసి, స్టోర్స్ తదితర విభాగాల్లో గేట్ మీటింగ్‌లు నిర్వహించి కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం యాజమాన్యానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్, జాయింట్ సెక్రటరీ కంది శ్రీనివాస్ మాట్లాడుతూ 12వ వేజ్ బోర్డు కమిటీ ఏర్పాటులో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న జాప్యం వల్ల కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తీసుకురావాలనుకుంటున్న నాలుగు లేబర్ కోడ్‌లు కార్మిక హక్కులను హరించే విధంగా ఉన్నాయని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను నిర్లక్ష్యం చేస్తే ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్, హింద్ మజ్దూర్ సభ తదితర జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త ఆందోళనలు, సమ్మెలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.కాంగ్రెస్ నాయకులు ప్రేమ్ లాల్, సట్ట కొండయ్య, పంగ చంద్రశేఖర్, గూగుల్ రాంబాబు, సాదుల సంపత్, కుమార్ యాదవ్, సాధన వేణి ప్రభాకర్, పొన్నం శ్రీనివాస్, కె. రాజయ్య యాదవ్, కోటయ్య, బైరిపోశాలు, రామ్ రెడ్డి, ఊరకొండ శ్రీకాంత్, కిరణ్ పాల్గొన్నారు.

# 12వ వేజ్ బోర్డు కమిటీని ఏర్పాటు చేయాలి

### సింగరేణి జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు




**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** 12వ వేజ్ బోర్డు వేతన కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని సింగరేణి జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లలో ధర్నా నిర్వహించారు. అనంతరం యాజమాన్యానికి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 11వ వేజ్ బోర్డు కాలపరిమితి ముగిసినా కేంద్ర ప్రభుత్వం, యాజమాన్యం నాలుగు లేబర్ కోడ్ల అమల్లో భాగంగా నేటి వరకు 12వ వేజ్ బోర్డు కమిటీని ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా వెంటనే స్పందించి వేతన కమిటీని నియమించాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ కే బాజీ సైదా, కొట్టే కిషన్ రావు, మోత్కూరి కొమురయ్య, రాచర్ల చంద్రమోహన్, నాగభూషణం, బద్రి బుచ్చయ్య, ఫిట్ కార్యదర్శులు దాడి రాజయ్య, మురళి చౌదరి, మోతే లచ్చన్న, శీలం చిన్నయ్య, జగన్, శ్రీధర్, గోపాల్ రెడ్డి, నంబయ్య, అశోక్, సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ నాయకులు సుధాకర్, సందీప్, హింద్ మజ్దూర్ సభ నాయకులు శశిధర్, ప్రసాద్, సురేందర్ పాల్గొన్నారు.

# శాకాహారమే శ్రేయస్కరం



**ప్రజాపక్షం/మందమర్రి :** శాకాహార జీవన విధానాన్ని ప్రోత్సహిస్తూ, జీవహింస నిర్మూలనతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రజలు తోడ్పడాలని పిలుపునిస్తూ మందమర్రి పట్టణంలో శాకాహార ఆవశ్యకతపై భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆచార్య శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ పట్టణ బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రి నుంచి రామన్ కాలనీ మార్కెట్ ఏరియా వరకు సాగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆచార్య శ్రీనివాస్ మాట్లాడుతూ జీవహింస పెరగడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతినడంతో పాటు మానవాళి మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఆరోగ్యవంతమైన జీవనం, ప్రకృతి పరిరక్షణ, జంతు సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మాంసాహారాన్ని తగ్గించి శాకాహార జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. శాకాహారం కేవలం ఆహార విధానం మాత్రమే కాకుండా మానవత్వం, కరుణ, ప్రకృతి పరిరక్షణకు ప్రతీక అని పేర్కొన్నారు. ర్యాలీలో పాల్గొన్న వారు చేతుల్లో బ్యానర్లు, ఫ్లెక్సీలు పట్టుకుని నినాదాలు చేశారు. ఈ అవగాహన ర్యాలీలో పట్టణానికి చెందిన శాకాహారప్రియులు, సామాజిక కార్యకర్తలు, మహిళలు, యువత, విద్యార్థులు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

## మండలానికి బీటీ రోడ్లు మంజూరు

**ప్రజాపక్షం/జన్నారం :** ఖానాపూర్ నియోజకవర్గంలోని జన్నారం మండలంలో పంచాయతీ రాజ్ శాఖ హ్యామ్ పథకం ద్వారా పలు బీటీ రోడ్లు మంజూరైనట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ ఈ రోడ్ల మంజూరుకు ప్రత్యేక చొరవ చూపి కృషి చేసిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. మంజూరైన వాటిలో జన్నారం–బాదంపల్లి రోడ్డు, చింతగూడ రోడ్డు నుంచి లక్ష్మీ దేవి ఆలయం వరకు రోడ్డు, ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి రోటిగూడ వరకు బీటీ రోడ్లు ఉన్నాయని వివరించారు. ఈ రోడ్ల నిర్మాణంతో మండల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు. జిల్లా కార్యదర్శి ముజాఫర్, మండల ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, పట్టణ అధ్యక్షుడు మంద రాజేష్, నాయకులు సుధాకర్ నాయక్, రాగుల శంకర్, నందునాయక్ పాల్గొన్నారు.

## పాఠశాలను తనిఖీ చేసిన సర్పంచ్

**ప్రజాపక్షం/వాంకిడిః** వాంకిడి మండలంలోని సరండి గ్రామ ప్రాథమిక పాఠశాలను గ్రామపంచాయతీ సర్పంచ్ మోహర్లే బాపూజీ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల బోధన, హాజరు, మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల విధుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి బోధన తీరును, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో ప్రధానోపాధ్యాయుడు విధులకు గైర్హాజరైన విషయం వెలుగులోకి వచ్చింది. ఆయన తరచుగా విధులకు హాజరుకావడం లేదని గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో సర్పంచ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై మండల విద్యాధికారిని ఫోన్ ద్వారా సంప్రదించగా ప్రధానోపాధ్యాయుడు అధికారిక సెలవులో ఉన్నారని తెలిపారు.

## పశువులకు లంపి స్కిన్ టీకాలు వేయించాలి

**ప్రజాపక్షం/నేరడిగొండః** నేరడిగొండ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలోని పాడి పశువులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత లంపి స్కిన్ వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ముమ్మరంగా సాగుతోంది. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క పాడి రైతు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యులు డాక్టర్ జీవన్ రాథోడ్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు సోకే సీజనల్ లంపి స్కిన్ వ్యాధి నివారణకు ఈ టీకాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. రైతులు తమ పశువులకు తప్పనిసరిగా వ్యాక్సినేషన్ చేయించి, విలువైన పశు సంపదను కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, పాడి రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/నిజాంసాగర్‌:** నిజాంసాగర్ మండలకేంద్రానికి చెందిన కి.శే ఉపాధ్యాయులు హరియా కుమార్తె డా.రజిత డా.వినోద్ వివాహ వేడుక ఎల్లారెడ్డిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ఈ శుభ కార్యానికి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు, కామారెడ్డి జిల్లా డీసీసీ చైర్మెన్ ఏలే మల్లిఖార్జున్‌లు ముఖ్య అథితులుగా హాజరై నవ దంపతులను ఆశీర్వదించారు. నవ దంపతులకు వారి కుటుంబీకులు, బంధుమిత్రులు స్మారక బహుమతులు అందజేసి తమ ఆప్యాయతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిదులు, కాంగ్రెస్ నాయకులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఆసుపత్రిని తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ

**ప్రజాపక్షం/నిజాంసాగర్‌:** నిజాంసాగర్ మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని కామారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి బుధవారం ఆఖస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ రోగుల వివరాలు తెలుసుకోవడంతో పాటు వారితో స్వయంగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, రక్త పరీక్షలు తదితర వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆయన వెంట వైద్యాధికారి డాక్టర్ రోహిత్‌కుమార్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక విద్య భవిష్యత్తుకు పునాది

**ప్రజాపక్షం/నిజాంసాగర్‌:** విద్యార్థులకు సాంకేతిక విద్య వారి భవిష్యత్తుకు గట్టి పునాది వేస్తుందని ఎన్నారై భుజంగారి భాస్కర్‌రెడ్డి అన్నారు. నిజాంసాగర్ మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు, డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లిఖార్జున్‌తో కలిసి 84 వేల రూపాయల విలువ చేసే నూతన కంప్యూటర్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. డీసీసీ చైర్మెన్ మల్లిఖార్జున్ బాల్య స్నేహితుడైన ఎన్నారై భుజంగారి భాస్కర్‌రెడ్డి విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసానికి తోడ్పాటుగా స్వంత డబ్బులతో ఈ కంప్యూటర్‌ను విరాళంగా అందించారు. ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థలల్లో చదువుతున్న విద్యార్థులు ఆదునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల కొరకు ముందుకు వచ్చిన ఎన్నారై భుజంగారి భాస్కర్‌రెడ్డి సేవా భావాన్ని ప్రత్యేకంగా కొనియాడారు.ప్రిన్సిపాల్ సంతోష్, అద్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## లయన్స్ నూతన కార్యవర్గం

**ప్రజాపక్షం/బాల్కొండ :** మండలంలోని కిసాన్‌నగర్ గ్రామంలో కీ।।శే।। నల్లచంద్రవ్వ నారాయణ్‌రెడ్డి లయన్స్ భవనంలో 202627 సంవత్సరానికి లయన్స్ క్లబ్ ఆఫ్ బాల్కొండ నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని అధ్యక్షులు యాదగిరిగౌడ్ తెలిపారు. సెక్రటరీగా కనకయ్యగౌడ్, ట్రెజరర్‌గా రమాకాంత్‌లను ఎన్నుకున్నామని రీజియన్ చైర్మన్ జ్ఞానసాగర్‌రెడ్డి తెలిపారు. ఎన్నుకున్న సభ్యులు సంవత్సరం పాటు లయన్స్ క్లబ్ ఆఫ్ బాల్కొండ వివిధ సేవా కార్యక్రమాలు, క్లబ్ నిర్వహణ నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో రీజియన్ సెక్రటరీ చాకు లింగం, సభ్యులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు ఊర పండగ ఆహ్వానం

**ప్రజాపక్షం/భీమ్‌గల్‌:** పట్టణ సర్వసమాజ్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఊర పండగకు రాష్ట్ర మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని కమిటీ ప్రతినిధులు బుధవారం వేల్పూర్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఊర పండగ ఆహ్వానపత్రికను ఎమ్మెల్యేకు అందజేశారు. అనంతరం కమిటీ అధ్యక్షులు పతాని కృష్ణ, ఉపాధ్యక్షులు తీగల రఘు మీడియాతో మాట్లాడుతూ నవవసంతాల అనంతరం జూలై 12న నిర్వహించనున్న ఊర పండగకు ఎమ్మెల్యేహాజరై గ్రామదేవతల ఆశీస్సులు పొందాలని కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కార్యక్రమానికి తప్పకుండా హాజరవుతానని హామీనిచ్చినట్లు వెల్లడించారు.

# ఆచూకీ తెలిస్తే సమాచారమివ్వండి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** సికింద్రాబాద్ నుంచి అకోలాకు రైలులో ప్రయాణిస్తూ ఒకరు కనిపించకుండా పోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిజామాబాద్ రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జూన్ 29న అకోలా మహారాష్ట్రకు చెందిన మహేష్‌కుమార్ (62) భార్య జయ అలించంద ఇద్దరు కలిసి సికింద్రాబాద్ నుంచి అకోలా వెళ్లుటకు జైపూర్ ఎక్స్ ప్రెస్ రకైలు నెం. 12790 లో రాతిర 9.30 ఎ2 కోచ్‌లో బర్త్ 9, 29 లో కూర్చొని ప్రయాణిస్తుండగా అక్కన్నపేట్ కామారెడ్డి మధ్యలో భర్త కూర్చున్న చోటుకు వెళ్లి జయ చూడగా తన భర్త సీటుపై కనిపించలేదని వెంటనే కోచ్ మొత్తం వెతికిన కనిపించకపోవటంతో రైలు మద్దతు కంప్లైంట్ చేసి నిజామాబాద్ ఆర్‌పిఎస్‌కు వచ్చి దరఖాస్తు ఇవ్వగా మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం పోలీస్‌స్టేషన్లకు లుక్ అవుట్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. తప్పిపోయిన వ్యక్తి ఎవరికైనా కనిపిస్తే నిజామాబాద్ రైల్వే పిఎస్ 8712658591 కు తెలియజేయాలన్నారు.

# జన్నారంలో కార్డెన్ సెర్చ్ 47 వాహనాలు సీజ్

**ప్రజాపక్షం/జన్నారం :** జన్నారం గ్రామపంచాయతీ పరిధిలోని వరద బాధితుల కాలనీలో బుధవారం ఉదయం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమణ మూర్తి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని మొత్తం 47 మోటార్ వాహనాలు, ఒక ఆటోను సీజ్ చేయడంతో పాటు ఒక లీటర్ గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ రమణమూర్తి మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా భద్రత కల్పించడం, శాంతిభద్రతలు పరిరక్షించడం, నేరాల నియంత్రణలో భాగంగానే ఈ కార్డెన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జన్నారం సబ్ ఇన్‌స్పెక్టర్ జి. ఉదయ్ కిరణ్, లక్షెట్‌పేట సబ్ ఇన్‌స్పెక్టర్ గోపతి సురేష్, దండేపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ రాజవర్ధన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పామాయిల్ సాగుతో స్థిరమైన ఆదాయం

### మాట్రిక్స్ కంపెనీ సిఇఒ ఉదయ్ కుమార్

**ప్రజాపక్షం/జన్నారం :** జన్నారం మండల పరిధిలోని దేవునిగూడ గ్రామంలో బుధవారం పామాయిల్ సాగుపై రైతులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. తక్కువ పెట్టుబడితో దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందించే పంటగా పామాయిల్‌ను రైతులు సాగు చేయాలని మాట్రిక్స్ కంపెనీ సిఇఓ ఉదయ్ కుమార్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామాయిల్ సాగు విధానాలు, యాజమాన్య పద్ధతులు, పంట నిర్వహణతో పాటు దీని ద్వారా రైతులకు కలిగే ఆర్థిక ప్రయోజనాలపై వివరించారు. రైతులు పామాయిల్ సాగుకు సంబంధించిన సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాట్రిక్స్ కంపెనీ ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ ఎంబడి కవిత, రైతులు గుర్రం గోపాల్ రెడ్డి, కల్లెం బాబు రెడ్డి, కల్లెం తిరుపతి రెడ్డి, కల్లెం లచ్చిరెడ్డి, సింగిరెడ్డి సుధాకర్ రెడ్డి, గుర్రం గంగారెడ్డి, కల్లెం ప్రవీణ్ రెడ్డి, తోట మధాకర్, ఆచే వెంకటేష్, మునిగెల భూచన్న, గూడ కిరణ్ పాల్గొన్నారు.

# అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

### వామపక్ష పార్టీల డిమాండ్

### జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** నిరుపేదలకు పక్కా ఇల్లునిర్మించి, గుడిసెలు లేని రాజ్యం తెస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని, బిల్లులు పెండింగ్ ఉండడంతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం నత్త నడకన సాగుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి పి. సుధాకర్ అన్నారు. బుధవారం నిరుపేదలకు ఇండ్లు, ఇండ్ల స్తలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్, న్యూడెమోక్రసి, ఆర్‌ఎస్‌పి పార్టీల ఆద్వర్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, అడిషనల్ కలెక్టర్ భుజంగరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి. సుధాకర్, సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ నగర కార్యదర్శి ఎం.సుధాకర్, సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ.రమేష్ బాబు, న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి వరదయ్య, ఆర్‌ఎస్‌పి జిల్లా కార్యదర్శి రాములు మాట్లాడుతూ ఇండ్ల స్థలాలు లేని నిరుపేదలకు ఇల్లు నిర్మించి ఇస్తామని ప్రభుత్వాలు ప్రకటిస్తున్నా ఆచరణలో కార్యరూపం దాల్చడం లేదన్నారు. కార్పొరేట్ కంపెనీలకు వేలాది ఎకరాలు ఉదారంగా అప్పగిస్తున్న ప్రభుత్వాలు, పేదల పట్ల మాత్రం నిరంకుశ వైఖరిని అవలంబిస్తున్నాయని ఆరోపించారు. ఎన్నో ఏళ్ళుగా ప్రభుత్వ ఖాళీ స్తలాలలో నివాసముంటున్న పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలన్నారు. నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇళ్లను అర్హులైన పేదలకు ఇవ్వాలన్నారు. అర్హులైన నిరుపేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ఐదు లక్షలకు, కేంద్ర ప్రభుత్వం ఐదు లక్షలు కలిపి మొత్తం పది లక్షలు లబ్దిదారులకు ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గత కెసిఆర్ ప్రభుత్వం లాగే పేదలను మోసం చేస్తామంటే చూస్తూ ఊరుకోమన్నారు. అర్హులైన వారందరికి ఇండ్లు ఉండేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో వామపక్ష పార్టీలన్ని ఐక్య కార్యాచరణతో పేదలను ఏకంచేసి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. వామపక్ష పార్టీల నాయకులు ఓమయ్య, రఘురాం, పెద్ది వెంకటరాములు, సుజాత, శివరాజ్, గంగారెడ్డి, అనిల్, నరేష్, అమూల్య, రఫీక్, సాయిలు, కిరణ్, శివరాజ్, సృజన్, గంగాదర్, లక్ష్మి, నారాయణ తదితరులు కార్యకర్తలు, బాధితులు పాల్గొన్నారు.

# రైతు ఆశీర్వాద సభ కాదు.. రైతు శాపనార్థాల సభ

### రుణమాఫీ కాదు రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న నమ్మకం మాఫీ అయింది : వేముల



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి రోజురోజుకు దారునంగా మారుతుంటే సిఎం రేవంత్‌రెడ్డి మాత్రం కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితమయ్యారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. నిన్న శిల్పకళా వేదికలో నిర్వహించింది 'రైతు ఆశీర్వాద సభ' కాదు అది అన్నదాతల 'శాపనార్థాల సభ' అన్నారు. రుణమాఫీ చేయనందుకా ? రైతుబంధు ఎగ్గొట్టినందుకా ?, వడ్లు కొననందుకా ?, యూరియా ఇవ్వనందుకా ? కరెంట్ కట్ చేస్తున్నందుకా ? దేనికి రైతులు సిఎం రేవంత్‌రెడ్డిని ఆశీర్వదించాలి ? ' అని ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ సభల ఖర్చు చూస్తుంటే 'చారానా కోడికి బారానా మసాలా ' చందంగా ఉందని ఎద్దేవా చేశారు. గతంలో కేసీఆర్ సిఎంగా ఉన్నప్పుడు ఎలాంటి ఆర్భాటాలు వృధా ఖర్చులు లేకుండా కేవలం ఒక ప్రెస్‌మీట్ ద్వారా ప్రకటించి 11 సీజన్లలో 73 వేల కోట్ల రైతుబంధు నిధులను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశారని గుర్తు చేశారు. ఒక్క రూపాయి కూడా ప్రజాధనాన్ని వృధా చేయలేదన్నారు. కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు సీజన్లలో మూడు సీజన్ల రైతుబంధు ఎగ్గొట్టి దాదాపు రూ. 28 వేల కోట్లు రైతులకు బాకీ పడిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పత్రికలలో టివిలలో భారీ ప్రకటనలు ఇస్తూ హైదరాబాద్‌లో పాటు తెలంగాణ అంతటా సిఎం రేవంత్‌రెడ్డి తన ముఖచిత్రంతో కూడిన పెద్దపెద్ద హోర్డింగ్‌లు పెట్టుకుంటూ ప్రజాధనాన్ని తగిలేస్తున్నారని విమర్శించారు. మంత్రి తుమ్మల ఏసీ రూముల్లో కూర్చొని యూరియా యాప్ బాగుందని, 90 శాతం రైతులు సంతోషంగా ఉన్నారని మాట్లాడటం హాస్యస్పదమన్నారు. ఇదే మాట గ్రామాల్లోకి వచ్చి రైతుల మధ్య నిలబడి చెబితే రైతులు మీ గూబ గుయ్యుమనిపిస్తారని హెచ్చరించారు.

# ఎఐతో వైద్య రంగంలో మార్పులు

### మందమర్రి జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ

**ప్రజాపక్షం/మందమర్రి :** వైద్య శాస్త్రానికి కృత్రిమ మేధ తోడవడంతో ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని, అయినప్పటికీ వైద్యుడి స్థానాన్ని ఏఐ భర్తీ చేయలేదని సింగరేణి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ స్పష్టం చేశారు. బుధవారం డాక్టర్స్ డే సందర్భంగా స్థానిక కెకె1 డిస్పెన్సరీలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎంత ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చినా, చివరికి కృత్రిమ మేధ కూడా వైద్యుడిని సంప్రదించాల్సిందేనని సూచించడం సమాజంలో డాక్టర్లకు ఉన్న ప్రాధాన్యతకు నిదర్శనమన్నారు. సింగరేణి యాజమాన్యం కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విధులకు తరచూ గైర్హాజరవుతున్న కార్మికులకు కౌన్సిలింగ్ అందించి చైతన్యం కల్పించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి ఓర్పుతో నాణ్యమైన సేవలు అందించాలని డిప్యూటీ జనరల్ మేనేజర్ కె. కిరణ్ కుమార్ కోరారు. సమాజానికి వైద్యులు అందిస్తున్న సేవలు ఎనలేనివని గుర్తింపు కార్మిక సంఘం కార్యదర్శి సలంద్ర సత్యనారాయణ కొనియాడారు. వేడుకల్లో భాగంగా ప్రత్యేక ప్రశంసాపత్రాన్ని డాక్టర్ పాక శ్రీజకు అందజేశారు.

# సిసిటివిల ఏర్పాటుతో నేరాల నియంత్రణ

### కాగజ్‌నగర్ డిఎస్‌పి వహీద్ ఉద్దీన్

**ప్రజాపక్షం/సిర్పూర్ టి :** గ్రామాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని కాగజ్‌నగర్ డిఎస్‌పి వహీద్ ఉద్దీన్ తెలిపారు. సిర్పూర్ టీ మండలంలోని గ్రామాల్లో శాంతిభద్రతలను మరింత పటిష్ఠం చేయడం, నేరాల నివారణ కోసం బుధవారం సిసిటివి కెమెరాల ఏర్పాటుపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డిఎస్‌పి వహీద్ ఉద్దీన్, కౌటాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ హాజరై మాట్లాడారు. పాఠశాలలు, మార్కెట్ ప్రాంతాలలో కెమెరాలను ఏర్పాటు చేయడం వల్ల నేరస్థులను త్వరగా గుర్తించి చట్టం ముందు నిలబెట్టేందుకు వీలవుతుందని చెప్పారు. సిసిటివి వ్యవస్థ గ్రామ భద్రతకు మూడో కన్నుగా పనిచేస్తుందని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని సురక్షిత గ్రామంగా రూపుదిద్దుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సిర్పూర్ టీ మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలు బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి : ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి :** మండల ప్రజలు బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలో గాయత్రి బ్యాంకు 83వ శాఖను ఆయన సర్పంచ్ కొత్తపల్లి హారిక అశోక్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలలో శాఖలను విస్తరించి తన సత్తా చాటుకుందన్నారు. ఈ సందర్భంగా యాజమాన్యంకు శుభాకాంక్షలు తెలిపారు. ఉపసర్పంచ్ కొత్తపల్లి అశోక్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# సర్‌లో కాంగ్రెస్ నాయకుల విస్తృత ప్రచారం

**ప్రజాపక్షం/మాక్లూర్ :** మండలంలోని గుంజిలి గ్రామ కాంగ్రెస్ నాయకులు అధ్యక్షులు పాల్దా హరీష్ ఆధ్వర్యంలో సర్ పోగ్రాం విజయవంతంగా నిర్వహించారు. అర్హులైన ఓటర్ల నుండి దరఖాస్తులను స్వీకరించి ఓ టరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు ఉత్సాహంగా పాల్గొని తమ వివరాలను నమోదు చేసుకున్నారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి ఓటు విలువైనదని, అర్హత ఉన్న ప్రతిఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావలన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సుంకె గంగాధర్, మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నవతే నవీన్, గ్రామసెక్రటరీ, కారోబార్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/ఆర్మూర్ :** మండలంలోని పల్లె గ్రామంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌కుమార్‌రెడ్డి మాజీ మండల అధ్యక్షులు సురకంటి చిన్నారెడ్డి ఆదేశాల మేరకు బుధవారం గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ పార్దేమ్ మనీషా సంజీవ్ ఆధ్వర్యంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎల్క రంజిత్‌కుమార్ సమక్షంలో గొర్ల షెడ్డు బర్ల షెడ్డు నిర్మించిన చెక్కులను ముగ్గురు లబ్ధిదారులు అది రూపకు రూ.71486, తోటపల్లి జలకు రూ.56091, జోరిగే యశశ్విని రూ. 51904 ల చెక్కులను అందజేశామన్నారు. మాజీ అధ్యక్షులు రాంసన్, మాజీ ఉపాధ్యక్షులు జోరిగె ధర్మయ్య, కొంపల్లి సుధాకర్, సాయగౌడ్, రాగం నరేష్, భూమేష్, అశోక్, బాపి నరేష్ పాల్గొన్నారు.

# కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన మండల ప్రత్యేకాధికారి

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ని మండల ప్రత్యేకాధికారి జిల్లా ఉపాధి కల్పనాధికారి విజేత, ఎంపీడీఓ సంతోష్‌కుమార్ బుధవారం సందర్శించారు.పాఠశాలలోని కిచెన్, డైనింగ్ హాల్, వాష్‌రూమ్స్, తాగునీటి సౌకర్యాలు, నివాస హాస్టల్ గదులు, పరిశుభ్రత నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థినులకు అందుతున్న ఆహారం నాణ్యత, మెనూ అమలు, ఆరోగ్యకరమైన వాతావరణం, భద్రతా చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులతో ఆత్మీయంగా ముచ్చటించిన అధికారులు వారికి అందుతున్న విద్యాబోధన పాఠ్యపుస్తకాలు, హాస్టల్ సౌకర్యాలు, ఉపాధ్యాయుల బోధన, క్రీడలు, ఇతర సహ పాఠ్య కార్యక్రమాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థినులు చదువుపై పూర్తి దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాలలో మౌలిక వసతులు, పరిశుభ్రత, విద్యాప్రమాణాలను మరింత మెరుగుపర్చేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ స్వామి, కేజీబీవీ ఇన్‌చార్జి అధికారి రాణి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# న్యూసెన్స్ కేసులో.. ఇద్దరికి ఏడు రోజులజైలు శిక్ష

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** రెండు రోజుల క్రితం మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులు డయల్ 100కు పదేపదే కాల్ చేసి న్యూసెన్స్ చేసిన కేసులో కోర్టు వారికి ఏడు రోజుల జైలుశిక్ష విధించింది. ఈ మేరకు నిజామాబాద్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ బుధవారం తీర్పు వెలువరించినట్లు 6వ టౌన్ ఎస్సై సందీప్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని 6 వ పిఎస్‌లోని శాస్త్రినగర్‌కు చెందిన గంపల లక్ష్మణ్, సంపంగి బాలాజీలు మద్యం మత్తులో డయల్ 100 కు పదే పదే కాల్ చేసి న్యూసెన్స్ క్రియేట్ చేయటంతో 6వ పిఎస్‌లో ఇద్దరిపై కేసు నమోదైంది. వారిద్దరిని 2వ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా వారికి ఏడు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

## ఆర్ఎంపి అధ్యక్షుడిగా మల్కాపురం భోజన్న

**ప్రజాపక్షం / కుంటాల :** కుంటాల మండల ఆర్.ఎం.పి., పి.ఎం.పి. అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా కల్లూరుకు చెందిన మల్కాపురం భోజన్న ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. బుధవారం కుంటాల మండల కేంద్రంలో భైంసా డివిజన్ అధ్యక్షులు ఆశ మొల్ల మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మండల కార్యవ ర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షు లుగా మల్కాపురం భోజన్నతో పాటు, ఉపాధ్య క్షులుగా తోకల రాజన్న కార్యదర్శిగా సట్ల శ్రీని వాస్, సహాయ కార్యదర్శిగా రాజురాయ్, గౌరవ సలహా సభ్యులుగా పల్లే భీమన్న సింధే వెంకట్‌రావు, డివిజన్ కార్యవర్గ సభ్యులుగా సురేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా, డివి జన్ అధ్యక్షులు మోహన్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు స్థాని కంగా ప్రథమ చికిత్సలు నిర్వహిస్తున్న ఆర్.ఎం.పి., పి.ఎం.పి. లను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తమ మెనిఫెస్టోలో తెలి పిన విధంగా శిక్షణ అందించి ఉపాధి కల్పిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం భోజనం అందించాలి

**ప్రజాపక్షం/కుంటాల :** విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎం.పి.ఓ. శోభన అన్నారు. బుధవారం మండల కేంద్రం లోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పరిసరా లతో పాటు కూరగాయలు, వంట సామాగ్రిని పరిశీలించారు. వర్షాకాలం, నేపథ్యంలో నీరు నిల్వకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచా లన్నారు. విద్యార్థులతో వంద శాతం హాజర య్యేటట్లు చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశా లలో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు అందించడం జరుగుతుంద న్నారు. పంచాయతీ కార్యదర్శి రాజా, బాపు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సాయినాథ్ ఉన్నారు.

## ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

**ప్రజాపక్షం / బోథ్ :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో బోథ్ మండల విద్యాశాఖాధికారికి కార్యాలయంలో వినతిపత్రం బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా బోయిడి ఆకాష్ మాట్లాడుతూ, కొన్ని ప్రైవేటు పాఠశాలలు విద్యార్థులకు అవ సరమైన పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ యూని ఫాంలను పాఠశాల ఆవరణక్షలనే విక్ర యిస్తూ తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నాయని అన్నారు. తల్లిదండ్రులకు బయట మార్కెట్‌లో కొనుగోలు చేసుకునే అవ కాశం ఇవ్వకుండా పాఠశాలల నుంచే కొను గోలు చేయాలని ఒత్తిడి చేయడం విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. దీనిపై సంబంధిత అధికారులు వెంటనే విచా రణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా, ఐఐటి ఫౌండేషన్ పేరుతో 3వ తరగతి విద్యార్థులకు సైతం 27000 వరకు అదనపు ఫీజులు వసూలు చేయడం ఆందోళన కలిగించే విష యమని అన్నారు. మూడో తరగతి విద్యార్థు లకు ఇలాంటి కోర్సుల అవసరం ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి కోర్సుల పేరుతో తల్లి దండ్రులను ఆకర్షించి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులపై విద్యా శాఖ సమగ్ర విచారణ జరిపి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## ప్రజల వద్దకే పోలీసు సేవలు.. నిర్వహించిన 'గ్రీవెన్స్ డే'కు విశేష స్పందన

### జిల్లా ఎస్పి జి.జానకీ షర్మిల



**ప్రజాపక్షం / భైంసా :** భైంసా పట్టణంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ భైంసా సబ్ డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జీదారుల వినతులను ఓపి కగా ఆలకించిన ఎస్పీ ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీ లించి, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చట్టపరమైన చర్యలు వెంటనే చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారు లను ఆదేశించారు. ఫిర్యాదుదారుల సమక్షంలోనే సంబం ధిత పోలీస్ స్టేషన్ అధికారులతో టెలిఫోన్ ద్వారా మాట్లా డిన ఎస్పీ ప్రతి వినతిపై వ్యక్తిగత పర్యవేక్షణతో చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యానికి తావులేకుండా నిర్ణీత గడువులో పరిష్కరించాలని స్పష్టం చేశారు. గ్రీవెన్స్ డే సందర్భంగా వచ్చిన కుటుంబ వివాదాలపై షీ టీం సిబ్బంది ఇరు వర్గా లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. పరస్పర అవగాహన కల్పించడంతో కొన్ని కుటుంబాలు తిరిగి కలిశాయి. నిర్మల్ వరకు ప్రయాణించాల్సిన అవసరం లేకుండా భైంసాలోనే కౌన్సిలింగ్ సౌకర్యం కల్పించినందుకు బాధితులు జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. పెండింగ్ ఫిర్యాదులపై ప్రత్యేక సమీక్ష గత గ్రీవెన్స్ డేల్లో స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కార స్థితిని ఎస్పీ సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతతో త్వరితగతిన పరిష్కరించా లని బాధితులకు పారదర్శకంగా న్యాయం అందేలా అధికా రులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలకు సత్వర పారదర్శక నాణ్యమైన పోలీసు సేవలు అందిం చడం నిర్మల్ పోలీసుల ప్రధాన లక్ష్యమని ఈ సంద ర్భంగా జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల పేర్కొన్నారు.

## కుంటాల బిసి బాలుర హాస్టల్‌లో అదనపు సీట్లు పెంచాలి

**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** కుంటాల మండల కేంద్రం లోని బీసీ బాలుర వసతి గృహంలో ఎదురవుతున్న సీట్ల కొరతను అధిగమించేందుకు వెంటనే అదనపు సీట్లను మంజూరు చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం నిర్మల్ జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఏ.ఎస్.డబ్ల్యు.ఓ.సత్యనారాయణ రెడ్డికి ఛాత్ర యువ సంఘర్ష సమితి , యూ.ఎస్.ఎఫ్.ఐ. విద్యార్థి సంఘాల నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా. సీ.వై.ఎస్.ఎస్. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శీతల్కర్ అరవింద్ , యూఎస్.ఎఫ్.ఐ. జిల్లా కార్యదర్శి నామాత్కర్ నవీన్ మాట్లాడుతూ, ప్రస్తుతం మాస్టల్‌లో ఉన్న సీట్లు పూర్తిగా నిండిపోవడంతో ప్రభుత్వ మోడల్ స్కూల్‌తో పాటు ఇతర విద్యా సంస్థల్లో చదువుతున్న అనేక మంది బీసీ విద్యార్థు లకు వసతి దొరకక నిరాశకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద, నిరు



పేద కుటుంబాల విద్యార్థులకు ప్రైవేట్ హాస్టళ్ళలో ఉండి చదువుకునే ఆర్థిక స్తోమత లేకపోవడంతో విద్యాభ్యాసాన్ని కొనసాగించడం కష్టసాధ్యంగా మారిందని వారు పేర్కొ న్నారు. సీట్ల కొరత కారణంగా కొంతమంది విద్యార్థులు చదువుకు దూరమవుతుండగా, మరికొందరు వసతి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.

## ఎంజెపి పాఠశాల ర్యాగింగ్ ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

**ప్రజాపక్షం / నిర్మల్ రూరల్ :** నిర్మల్ పట్టణంలోని మహాత్మాజ్యోతిభాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థిపై జరిగిన ర్యాగింగ్ ఘటన అత్యంత బాధాకరమని తీవ్ర ఆందోళనక రమని ఎస్.ఎఫ్.ఐ. నిర్మల్ జిల్లా కమిటీ స్పష్టం చేసింది. ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ. జిల్లా కన్వీనర్ దిగంబర్ మాట్లాడుతూ, నర్సాపూర్ మండలం టెంబుర్ని గ్రామా నికి చెందిన తోడిశెట్టి సాయి విగ్నేష్ అనే విద్యార్థి ఈ ఘోరమైన ర్యాగింగ్‌కు గురికావడం విద్యా వ్యవస్థకే మచ్చ తెచ్చేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించి 10 మంది సీనియర్ విద్యార్థులతో పాటు ప్రిన్సిపాల్, ఇన్‌చార్జి మరియు జిల్లా కోఆర్డి నేటర్ (డిసిఓ) జీవన్ లాంటి బాధ్యులపై ఫోక్సో కేసులు నమోదైనప్ప టికీ, సదరు అధికారులపై ఇప్పటివరకు తగిన పరిపాలనా చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజల్లో అనేక అనుమా నాలు వ్యక్తమవుతున్నాయని మండిపడ్డారు. ఈ విష యంలో ఆర్.సి.ఓ. మౌనం వీడి వెంటనే చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యార్థిపై జరిగిన ఈ దాడిపై జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి ఎటు వంటి ఒత్తిళ్ళకు లొంగకుండా సమగ్ర నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని కోరారు. పోక్సో కేసు నమోదైన అధికారులను వెంటనే విధుల నుండి తొలగించి, విచారణ పూర్తయ్యే వరకు సస్పెండ్ చేయాలని స్పష్టం చేశారు. అలాగే ర్యాగింగ్‌కు గురై తీవ్ర మానసిక, శారీరక క్షోభ అనుభవిస్తున్న బాధిత విద్యార్థి సాయి విగ్నేష్ కుటుంబా నికి ప్రభుత్వం జిల్లా యంత్రాంగం తక్షణమే పూర్తి భరోసా కల్పించి న్యాయం చేయాలన్నారు. భవిష్యత్తులో ఇటువంటి అమానవీయ ఘటనలు జిల్లాలోని ఏ పాఠశాల లోనూ పునరావృతం కాకుండా ఉండేందుకు గురుకు లాలు వసతి గృహాలలో ప్రత్యేక పర్యవేక్షణ, రక్షణ వ్యవ స్థను ఏర్పాటు చేయడంతో పాటు యాంటీ ర్యాగింగ్ కమి టీలను పటిష్టం చేయాలని సూచించారు. హాస్టళ్ళలో విద్యార్థులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యతలను విస్మరిం చిన అధికారులపై చర్యలు తీసుకోకపోవడంలో అలసత్వం చేస్తే ఎస్.ఎఫ్.ఐ. ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో ఎస్.ఎఫ్.ఐ. నాయకులు కార్తిక్, తరుణ్ తదిత రులు పాల్గొన్నారు.

## బన్నపల్లి గ్రామ పంచాయతీలో రికార్డుల తనిఖీ

**ప్రజాపక్షం / దిలావర్‌పూర్ :** మండల పరిధిలోని బన్నపల్లి గ్రామ పంచాయతీని బుధవారం దిలావర్ పూర్ మండల పంచాయతీ అధికారి ఎం.పి.ఓ. గోవ ర్ధన్ ఆకస్మికంగా సందర్శించారు. ఇందులో భాగంగా గ్రామ పంచాయతీకి సంబంధించిన పలు ముఖ్యమైన అధికారిక రికార్డులను ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేసి, నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం గ్రామం లోని నర్సరీ, తడి,పొడి చెత్త వేరుచేసే కేంద్రం (సెగ్రిగే షన్ షెడ్) మరియు వైకుంఠ ధామం (పిపిఏ) పను లను క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.నర్సరీల్లో మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఈ సందర్భంగా ఎంపీఓ అధికారులను ఆదేశించారు.

## ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌లో భోజనం చేసిన కలెక్టర్

### ప్రతీరోజు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలి - జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం / నిర్మల్ కలెక్టరేట్ :** జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలోని ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌లో మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌లో అందిస్తున్న ఆహారం, నాణ్యత, పరిశుభ్రత, నిర్వ హణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌లో అందిస్తున్న ఆహారం రుచికరంగా, నాణ్యతతో ఉందని నిర్వాహకులు, సిబ్బందిని కలెక్టర్ అభినం దించారు. ఉద్యోగులకు ప్రతీరోజు పరిశుభ్రమైన వాతావర ణంలో నాణ్యమైన పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై అవగాహన

**ప్రజాపక్షం/జన్నారం :** ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్య క్రమంలో భాగంగా జన్నారం మండలంలోని రోటిగూడ గ్రామపంచా యతీ కార్యాలయంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బూత్ లెవల్ అధికారులు, గ్రామ సర్పంచ్, ప్రజాప్రతినిధులకు ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులపై రెవెన్యూ అధికారులు అవగాహన కల్పించారు. ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ బక్కయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, రోటిగూడ సర్పంచ్ జిల్లపెల్లి గోపాల్, మాజీ ఎంపీటీసీ కొత్తం శంకరయ్య, వార్డు సభ్యులు, బూత్ లెవల్ అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పదోన్నతి ఇవ్వకుండా ఓవర్‌మ్యాన్ విధులు చేయించడం అన్యాయం

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** సింగరేణి సంస్థలో జేఎంఈటీ 2016, 2017 బ్యాచ్ సీనియర్ మైనింగ్ సర్దార్లకు ఓవర్‌మ్యాన్‌గా పదోన్నతి కల్పించకపోవడం అన్యాయమని కార్మికులు బుధవారం యాజమాన్యా నికి వినతిపత్రం సమర్పించారు. నిబంధనల ప్రకారం మూడేళ్ల సేవ పూర్తి చేసిన తమకు ఖాళీలు లేవనే నెపంతో పదోన్నతి ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారికంగా పదోన్నతి ఇవ్వకుండానే గనుల్లో ఓవర్‌మ్యాన్ విధులను తమతో చేయించుకుంటున్నారని ఆరోపించారు. తమకు ఇచ్చిన ఓవర్‌మ్యాన్ అధికారాలను రద్దు చేయాలని, పదోన్నతి ఇచ్చే వరకు తమ హోదాకు సంబంధించిన విధులు మాత్రమే నిర్వహి స్తామని స్పష్టం చేశారు. అర్హులైన వారికి వెంటనే పదోన్నతులు కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## ఐటిఐ విద్యార్థులకు ఘన వీడ్కోలు

### ప్రిన్సిపాల్ వై. రమేష్

**ప్రజాపక్షం/జన్నారం :** ప్రభుత్వ ఐటీఐ–అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ జన్నారంలో నైపుణ్య శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు బుధవారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ వై. రమేష్ అధ్యక్షత వహించారు. ఇండస్ట్రీ 4.0, ఆటోమే షన్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ రంగాల్లో ఐటీఐ–అడ్వాన్స్‌డ్ టెక్నా లజీ సెంటర్ విద్యార్థులకు విస్తృత ఉద్యోగావకాశాలు ఉన్నాయని తెలి పారు. కార్యక్రమానికి హనుమకొండ, తాడ్వాయి, సిరిసిల్ల ప్రభుత్వ ఐటీఐల ప్రిన్సిపాళ్లు, మోటివేషనల్ స్పీకర్లు పి. సంపత్ కుమార్, డా. రాంప్రసాద్ హాజరై విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ నైపు ణ్యాలు, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్ర మంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యా, క్రీడా సామగ్రి పంపిణీ

**ప్రజాపక్షం/లక్సెట్టిపేట :** మండలంలోని పోతపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గుమ్మడి రాజలింగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం వాటర్ బాటిళ్లు, స్కూల్ బ్యాగులు, ప్యాడ్లు, విద్యా క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల పేద విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం ద్వారా వారి చదువుకు ప్రోత్సాహం అందించడమే ఫౌండేషన్ లక్ష్యమని ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవ స్థాపకులు గుమ్మడి కిరణ్ తెలిపారు. గ్రామ సర్పంచ్ నైనాల లక్ష్మి , ఉప సర్పంచ్ భూపెల్లి మల్లేష్, మాజీ సర్పంచ్ పురుషోత్తం, నైనాల శంక రయ్య, చరణ్, పవన్, ప్రధానోపాధ్యాయురాలు పాల్గొన్నారు.

## రైతు భరోసా సంబరాలు

**ప్రజాపక్షం / భైంసా :** ముథోల్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ ఆదేశానుసారం భైంసా పట్టణంలోని కమలా జిన్నింగ్ ఫ్యాక్టరీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా సంబరాలు నిర్వహించడం జరిగింది.బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్రే, ముథోల్ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ షఫీ, లోకేశ్వరం మండల అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి జేడీ రాం , మతీన్, జాఫర్, జీ సాయి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్లి గ్రామంలో నూతన పోచమ్మ గుడి ప్రారంభోత్సవం

**ప్రజాపక్షం / లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని అర్లి గ్రామం లోని నూతనంగా అడెల్లి పోచమ్మ ఆలయాన్ని గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్మించారు. బుధవారం రోజున గ్రామస్తుల మరియు సర్పంచ్ ప్రసన్న వినోద్ ఆధ్వర్యంలో వేద పండితులు అభిషేకాలు అర్చనలు పూజలు హోమాలు నిర్వహించి పోచమ్మ ఆలయ ప్రతిష్టాపన చేశారు. ఈ సంద ర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, నూతనంగా పోచమ్మ ఆలయం నిర్మించడంతో పాడిపంటలు ఆయురారోగ్యాలు వ్యాపారాలు అభివృద్ధి చెందాలని గ్రామస్తులు మొక్కులు మొక్కారు. అనంతరం గ్రామంలోని అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విశిష్ట సేవా కార్యక్రమాలు

### సేవా కార్యక్రమాలకు పెట్టింది పేరు సుల్తానాబాద్ లయన్స్ క్లబ్

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : లైన్స్ క్లబ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ గవర్నర్ మోర భద్రేశం ఆదేశాల మేరకు సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ పట్టణంతోపాటు వివిధ గ్రామాలలో 20 విశిష్ట కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. సుల్తానాబాద్ పట్టణంలో మార్నింగ్ వాకర్స్ కు మధుమేహం వ్యాధి పై కరపత్రాలు అందజేసిఅవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం నూతన వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులతో పాటు కోశాధికారికి ప్రత్యేక సన్మానం నిర్వహించారు.లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ మున్సిపల్ పరిశుద్ధ కార్మికులకు అల్పాహార విందు ఏర్పాటు చేయడం జరిగింది.అంతేకాకుండా ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు అల్పాహార విందు ఏర్పాటు చేశారు.సుల్తానాబాద్ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ బస్టాండ్ లో ప్రయాణికులకు కరపత్రాలతో నేత్రదానంపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ సభ్యులు ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కాట్నపల్లి వద్ద జాతీయ రహదారిపై ప్రయాణికులకు కరపత్రాలు ఇస్తూ హెల్మెట్ ప్రాధాన్యతను, రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. మండలంలోని నరసయ్య పల్లి గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమం నిర్వహించి100 మొక్కలు నాటారు. మండలంలోని గర్రెపల్లి తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలలో ప్రిన్సిపల్ గోల్డి బల్బీర్ కౌర్, ఉపాధ్యాయ బృందంతో కలిసి విద్యార్థిని విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై సమావేశం ఏర్పాటు చేసి క్లబ్ అధ్యక్షులు, ప్రిన్సిపల్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు వారి అమూల్యమైన సందేశాన్ని విద్యార్థిని విద్యార్థులకు అందించారు.అనంతరం విద్యార్థి విద్యార్థులు కలిసి మొక్కలు నాటి ప్రతి విద్యార్థిని విద్యార్థి వారి యొక్క జన్మదిన సందర్భంగా ఒక మొక్కను నాటే సంకల్పానికి పూనుకోవాలని పిలుపునిచ్చారు. మండలంలోని ఈబిఐ బ్రిక్స్ ఇండస్ట్రీస్ లో వలస కార్మికులకు 30 కుటుంబాలకు నిత్యావసర సరుకులు అయిన బియ్యం, కూరగాయలు ఇతర సామాగ్రిని లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అందజేశారు.నరసయ్య పల్లె గ్రామంలోనే ప్రాథమిక ఉన్నంత పాఠశాలలో 30 మంది నిరుపేద విద్యార్థులకు నోట్ బుక్స్,పెన్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయ బృందంతో కలిసి అందజేశారు. సుల్తానాబాద్ పట్టణంలోని మానసిక వికలాంగుల కేంద్రంలో 40 మంది మానసిక వికలాంగులకు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. పోస్టల్ డే సందర్భంగా పోస్ట్ ఆఫీస్ లో పనిచేస్తున్న సిబ్బందికి ప్రత్యేక సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్స్ డే సందర్భంగా అయిదుగురు వైద్యులకు జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ మాటేటి సంజయ్ సహకారంతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కరపత్రాలు అందజేసి క్యాన్సర్ పై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. చార్టెడ్ అకౌంట్ డే సందర్భంగా ఇద్దరు చార్టెడ్ అకౌంటెంట్లను ఘనంగా సన్మానించారు.బాల బాలికలకు స్నాక్స్ అందజేశారు.

# అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు



ప్రజాపక్షం/ముత్తారం : తెలంగాణ రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ సహకారంతో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ అన్నారు.బుధవారంపెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన సాధ కోమలతస్వామి దంపతులకు ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆశీస్సులతో ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది.ఈ ఇల్లు నిర్మాణంలో ఏర్పాటు చేసిన స్లాబ్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముత్తారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల రాజయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షులు వాజిద్ పాషా,కాంగ్రెస్ నాయకులు కొట్టే ఉపేందర్,మండల స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు ఆకోజు అశోక్ చారి హాజరై పనులు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ..నిరుపేద కుటుంబాలకు నిలువ నీడ కల్పించడమే ధ్యేయంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున ప్రతిష్ఠాత్మకంగా ముందుకు తీసుకెళ్తున్నారని కొనియాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాదాసి రవి,వార్డు సభ్యులు వీరగోని అంజి,మార్త మహేందర్,యూత్ కాంగ్రెస్ నాయకులు లక్కం రాజు,అంబటి కుమార్ యాదవ్,తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి ఓవర్సీస్ పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలి

### జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారి నరేష్ కుమార్ నాయుడు



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : ముఖ్యమంత్రి ఓవర్సీస్ పథకం క్రింద స్కాలర్ షిప్/ఆర్థిక సహాయం కొరకు అర్హత కలిగిన మైనార్టీస్ విద్యార్థులు జూలై 15 లోగా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసి, జూలై 31లోపు ఆన్ లైన్ దరఖాస్తులను జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాలని జిల్లా మైనార్టీస్ సంక్షేమ అధికారి పి.నరేష్ కుమార్ నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.తెలంగాణ మైనారిటీ సంక్షేమ శాఖ డైరెక్టర్ అండ్ కమీషనర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లాలోని మైనారిటీ (ముస్లింలు,క్రిస్టియన్,సిక్కు,బౌద్ధ,జైన్ మరియు పార్సీ) విద్యార్థులకు ముఖ్యమంత్రి ఓవర్సీస్ పథకం క్రింద స్కాలర్ షిప్/ఆర్థిక సహాయం కొరకు, డిగ్రీ మరియు ఇంజనీరింగ్ లో 60 శాతం మార్కులు ఉండి పోస్టు గ్రాడ్యుయేట్ చేయుటకు, పి.జి. లో 60 శాతం మార్కులు వచ్చి డాక్టరేట్ చదువుటకు 2026 జనవరి 1 నుండి జూన్ 30, 2026 వరకు విదేశీ యూనివర్సిటీలలో అడ్మిషన్ పొందిన మైనార్టీ విద్యార్థులు ఆన్ లైన్ లో నమోదు చేసుకోవాలని తెలిపారు.దరఖాస్తుదారుని కుటుంబ సంవత్సర ఆదాయం 5 లక్షల రూపాయల లోపు ఉండాలని, అమెరికా,యూకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, న్యూజిలాండ్, దక్షిణ కొరియా దేశాలలోని యూనివర్సిటీలలో అడ్మిషన్ పొంది ఉండాలని, మిగతా అర్హత వివరాలకు వెబ్సైట్ చూడాలని సూచించారు. అర్హత కలిగిన మైనార్టీ విద్యార్థులు జూలై15, 2026 సాయంత్రం 5:00 గంటల లోపు www.telanganaepass.cgg.gov.in వెబ్సైట్ లో దరఖాస్తు చేసుకొని, సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు మూడు జతల జిరాక్స్ ప్రతులను జూలై 31, 2026 సాయంత్రం 5:00 గంటల లోపు జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ, పెద్దపల్లి కార్యాలయంలో సమర్పించాలని కోరారు.ఎంపికైన విద్యార్థులకు 20 లక్షల రూపాయల ఉపకార వేతనము/ఆర్థిక సహాయం రెండు విడతలలో 60 వేల రూపాయల వరకు విమాన చార్జీలు చెల్లించబడతాయని,ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనార్టీస్ సంక్షేమ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# కార్మికులకు 12వ వేతన కమిటీ ప్రక్రియ వెంటనే ఏర్పాటు చేయాలి

### నల్ల బ్యాడ్జీలు ధరించి అధికారులకు వినతి పత్రాలు ఇచ్చిన జెఎసి నాయకులు

ప్రజాపక్షం/పెద్దపల్లి : బొగ్గు గని కార్మికులకు 12వ వేజ్ బోర్డు వేతన ఒప్పంద ప్రక్రియను వెంటనే ఏర్పాటు చేయాలని, దీనికి అడ్డుగా ఉన్న నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ ఏఐటియుసి, ఐఎన్టియుసి, సిఐటియు, హెచ్ఎమ్ఎస్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి అధికారులకు వినతి పత్రాలు అందజేశారు.బుధవారం సింగరేణి ఆర్జిఐ ఏరియాలోని జిడికె11వ ఇంక్లైన్ మరియు జిడికె2వ ఇంక్లైన్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమాల్లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసిఐప ప్రధాన కార్యదర్శి మద్దె ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను ప్రారంభించి మాట్లాడారు.కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 4 లేబర్ కోడ్లు రద్దు చేసి, నూతన వేతన కమిటీని 40% ఫిట్మెంట్ బెనిఫిట్తో 12వ వేతన కమిటీని వెంటనే ఏర్పాటు చేసి వేతన ఒప్పంద ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలి, 12వ వేతన ఒప్పంద చర్చలను ఆలస్యం చేయకుండా తక్షణమే ప్రారంభించాలి, దశాబ్దాల పాటు పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాసే ప్రతి ప్రయత్నాన్ని తిప్పికొడతామని వారు హెచ్చరించారు. జూలై 1 న దేశవ్యాప్తంగా జరగనున్న ఆందోళన కార్యక్రమాల్లో కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొన్నారని వారు పేర్కొన్నారు.జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ముందు భారీ సంయుక్త ధర్నాను బుధవారం నిర్వహించామని వారు తెలిపారు.ఈ ధర్నా లో జేఏసీ అగ్ర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారని వారు పేర్కొన్నారు.కోట్లాది రూపాయల లాభాలను ఆర్జిస్తున్న బొగ్గు పరిశ్రమలో ప్రాణాలను పణంగా పెట్టి పని చేస్తున్న కార్మికులకు న్యాయమైన వేతన ఒప్పందాన్ని అమలు చేయకుండా కాలయాపన చేయడం తీవ్ర అన్యాయమని మండిపడ్డారు. నాలుగు లేబర్ కోడ్లను పూర్తిగా రద్దు చేసి, 12వ వేతన ఒప్పంద ప్రక్రియ ప్రారంభించే వరకు తమ ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు.కేంద్ర ప్రభుత్వం తన మొండి వైఖరిని వీడకపోతే దేశవ్యాప్తంగా మరింత ఉధృతమైన ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్మికుల ఐక్యశక్తి ముందు కార్మిక వ్యతిరేక విధానాలు నిలవవని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులతో పాటు ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆఫీస్ బేరర్స్ మాదన మహేష్, సంకె అశోక్, బోగ సతీష్ బాబు, S. వెంకట్ రెడ్డి, సిద్దమల్ల రాజు,చక్రపాణి,దొంత సాయన్న, శ్రీనివాస రావు,చెప్యాల భాస్కర్,పిట్ కార్యదర్శులు మానాల శ్రీనివాస్, పొన్నాల వెంకటయ్య,కారంపూరి వెంకన్న,గుర్రం ప్రభుదాస్,నాయిని శంకర్,గొడిశల నరేష్,బలుసు రవి, బండి మల్లేష్, దాసరి శ్రీనివాస్,దాసరి అనిల్,రెడ్డి వెంకట స్వామి,ఇజ్జగిరి రాజు, పాల్గొన్నారు.



# నిలాయిపేట్‌లో ఇందిరమ్మ ఇళ్ళకు శంకుస్థాపన

ప్రజాపక్షం / నిర్మల్ రూరల్ : నిర్మల్ రూరల్ మండల పరిధిలోని నీలాయిఇపేట్ గ్రామంలో అర్హులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణ పనులను బుధవారం అధికారికంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా గ్రామంలో నిర్మించ తలపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల స్థలాల వద్ద సాంప్రదాయబద్ధంగా ముగ్గుపోయించి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు సుమలత భీమేష్, ఉపాధ్యక్షులు నెమలి అర్జున్ పాల్గొని మాట్లాడారు. నిరుపేదల సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలను లబ్దిదారులు సద్వినియోగం చేసుకుని నిర్ణీత కాలంలోనాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసుకోవాలని వారు సూచించారు. గ్రామ పాలకమండలి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఆమంద సురేష్, మాలోత్ సరస్వతీ గణేష్, సట్ల స్వప్నతో పాటు స్థానిక పంచాతీ కార్యదర్శి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇళ్ళ నిర్మాణాల పనుల పర్యవేక్షణ మరియు లబ్దిదారులకు కావలసిన మౌలిక వసతుల కల్పనకై స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, లబ్దిదారులు మాలోత్ కిషన్, దాసరి చిన్న నారాయణ, నల్ల రవీందర్, కోట చిన్న లింగన్న మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఎంపిడిఒ కార్యాలయంలో టైపిస్ట్‌గా రాజయ్య విధుల్లో చేరిక

ప్రజాపక్షం/ముత్తారం :పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల ప్రజా పరిషత్ (ఎంపీడీవో) కార్యాలయంలో నూతన టైపిస్ట్‌గా మెరుగు రాజయ్య విధుల్లో చేరారు. ఇంతకుముందు ఆయన సుల్తానాబాద్ మండల ఎంపీడీవో కార్యాలయంలో టైపిస్ట్‌గా పనిచేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ముత్తారం మండలానికి బదిలీపై వచ్చిన రాజయ్య, స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

# ఎంపిడిఒ లలిత సేవలు మరువలేనివి: సర్పంచ్‌లు

ప్రజాపక్షం/ముత్తారం :పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా సేవలందించి పదవీ విరమణ చేసిన లలిత సేవలు మరువలేనివని మండల సర్పంచులు,తాజా మాజీ సర్పంచ్ లు కొనియాడారు.బుధవారంముత్తారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముత్తారం మండలం వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల అభివృద్ధి కోసం ఎంపీడీవో లలిత ఎంతో కృషి చేశారని గుర్తుచేసుకున్నారు.విధి నిర్వహణలో మంచికి మారుపేరుగా నిలిచిన ఆమె సేవలు ఎంతో అభినందనీయమని అన్నారు.అలాంటి ఉత్తమ అధికారిణి పదవీ విరమణ చేయడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రస్తుత ఎంపీడీవో సురేష్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ సదానందం,ఉపాధి హామీ ఏపీఓ దయమణి, టెక్నికల్ అసిస్టెంట్లు అంజయ్య, టైపిస్ట్ రాజయ్యతో పాటు మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు రాజేందర్,బద్రు నాయక్,రవీందర్,సంధ్య,మల్లేశ్వరి,నరేష్,సతీష్ తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిబంధనల పట్ల అంకితభావంతో విధులు

### జిల్లా విద్యాధికారి జగన్మోహన్ రెడ్డి

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లా ఉపాధ్యాయ ఐక్యవేదిక ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారి డాక్టర్ బొల్లం జగన్మోహన్ రెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవం జిల్లా కేంద్రంలోని ఎస్.ఆర్.కె. కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. జిల్లాలోని 25 ఉపాధ్యాయ సంఘాలు ఐక్యవేదికగా ఏర్పడి ఈ కార్యక్రమాన్ని సంయుక్తంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయ ఐక్యవేదిక కన్వీనర్ లకవత్ మోతీలాల్, కో-కన్వీనర్లు విక్కుర్తి లక్ష్మీ నారాయణ, మార్వాడి గంగరాజులు మాట్లాడుతూ, డాక్టర్ జగన్మోహన్ రెడ్డి విద్యారంగంలో 32 సంవత్సరాలపాటు విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. తన ఉద్యోగ జీవితాన్ని డైట్ లెక్చరర్‌గా ప్రారంభించి, ఎందరో విద్యార్థులు, శిక్షణార్థి ఉపాధ్యాయులకు నాణ్యమైన విద్యాబోధన అందించి ఉత్తమ ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దారని అన్నారు. జిల్లాలోని 25 ఉపాధ్యాయ సంఘాల జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర నాయకులు, 13 మండలాల విద్యాధికారులు, జిల్లా విద్యాధికారి కార్యాలయ సిబ్బంది, మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.